తెలుగుకలం

TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

అనంతపురం | కర్నూలు | కడప | చిత్తూరు | ప్రకాశం | గుంటూరు | విజయవాడ | హైదరాబాద్

సంపుటి : 01 సంచిక : 82 ఎడిటర్. అచుకట్ల ఖాదర్ బాషా పేజీలు : 08 ఆదివారం 25 - 10 - 2026 వెల రూ. 2 రూ/

మహారాష్ట్రతో తుమ్మిడిహట్టి

బ్యారేజీ ఎత్తుపై చర్చలు

- సోమవారం ముంబయికి సీఎం రేవంత్‌రెడ్డి
- తుమ్మిడిహట్టిపై మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరపనున్నారు
- సీఎంతో పాటు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, అధికారులు వెళ్లనున్నారు
- 2025 ఏప్రిల్‌లో మేడిగడ్డపై ఎన్‌డీఎస్‌ఏ తుది నివేదిక



హైదరాబాద్ :

తుమ్మిడిహట్టిపై మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు ముహూర్తం ఖరారైంది. సోమవారం ముంబయిలో చర్చలు జరగనున్నాయి. ఇందుకోసం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, నీటిపారుదల శాఖ అధికారులు సోమవారం ముంబయి వెళ్లనున్నారు. తుమ్మిడిహట్టిపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ కానున్నారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, అధికారులు పాల్గొనున్నారు.మరోవైపు సోమవారం జరగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం వాయిదా పడింది. అదేరోజు ముంబయిలో మహారాష్ట్ర సీఎంతో రేవంత్‌రెడ్డి సమావేశం ఉన్నందున వాయిదా వేయాలని తెలంగాణ కోరింది. ఈ విజ్ఞప్తిపై స్పందించిన కేఆర్ఎంబీ సమావేశాన్ని వాయిదా వేశారు. సోమవారం జరగాల్సిన కృష్ణా బోర్డు సమావేశం మంగళవారానికి వాయిదా వేసింది.సాగునీటి ప్రాజెక్టులపై శుక్రవారం రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశంలో భాగంగా తుమ్మిడిహెట్టిపై ప్రధానంగా చర్చించారు. 152 మీటర్ల ఎత్తున తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి ఒప్పించేందుకు అవసరమైన - మిగతా 2 లో

హైదరాబాద్‌కు

నీటి గండం



- పొదుపుగా వాడాలంటూ లౌడ్‌స్పీకర్లతో ప్రచారం
- ఎల్‌నినో ప్రభావంతో హైదరాబాద్‌లో తీవ్ర నీటి కొరత
- రాష్ట్రంలో 27 శాతం తక్కువ వర్షపాతం నమోదు
- తాగునీటి సరఫరాకే తొలి ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వం
- నీటి పొదుపుపై అవగాహన కార్యక్రమాలకు అధికారుల ఆదేశం

హైదరాబాద్ :

గురిచేస్తోంది. ఎల్‌నినో ప్రభావంతో హైదరాబాద్ నగరాన్ని తీవ్ర నీటి సంక్షోభం ఆందోళనకు రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం తగ్గడం, రిజర్వాయర్లలో - మిగతా 2 లో



సివిల్స్ కోచింగ్ విద్యార్థులకు అండగా తెలంగాణ ప్రభుత్వం

- ఆర్థిక సాయం పెంపు
- సివిల్స్ అభ్యర్థులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు
- బీసీ స్టడీ సర్కిల్ విద్యార్థుల స్టైఫండ్ రూ. 7 వేలకి పెంపు
- పుస్తకాల ఫండ్ రూ. 5 వేల నుంచి రూ. 10 వేలకు రెట్టింపు

హైదరాబాద్ :

సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమవుతున్న బీసీ విద్యార్థులకు తెలంగాణ - మిగతా 2 లో



అల్లూరి జిల్లాలో పేలుడు ప్రమాదం

- ఐదుగురి మృతి
- రోడ్డు పనుల కోసం కొండను పేల్చుతుండగా ఘటన
- ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి
- మృతుల్లో టీచర్, డ్రైవర్, ముగ్గురు కూలీలు

అమరావతి :

ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు నిర్మాణ - మిగతా 2 లో



46 ఆర్థిక అంశాలపై పార్లమెంటరీ కమిటీ అధ్యయనం

- క్రిప్టో నుంచి ఏఐ వరకు అధ్యయనం
- 2026-27 ఆర్థిక సంవత్సరానికి కీలక అంశాలను ఆర్థిక వ్యవహారాల స్థాయీ సంఘం ఎంపిక చేసింది
- క్రిప్టో, ఆర్థిక రంగంలో కృత్రిమ మేధ వినియోగంపై ప్రత్యేకంగా పరిశీలనచనుంది

ఢిల్లీ :

దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన కీలక అంశాలపై పార్లమెంటరీ స్థాయీ సంఘం సమగ్ర అధ్యయనం చేపట్టనుంది. క్రిప్టో ఆస్తులు, ఆర్థిక రంగంలో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం, కరెన్సీ నిర్వహణ, బ్యాంకింగ్, బీమా, పన్నుల సంస్కరణలు సహా మొత్తం 46 అంశాలను 2026-27 - మిగతా 2 లో

'ఇండియా' కూటమి

ర్యాలీ వద్దు



- నవంబర్ 1న ఢిల్లీలో 'ఇండియా' కూటమి ర్యాలీ
- వాయిదా వేయాలని వ్యాపారుల విజ్ఞప్తి
- దీపావళి సీజన్‌లో రూ.10,000 కోట్ల వ్యాపారం నష్టపోతామని వర్తక సంఘం ఆందోళన
- రామ్‌లీలా మైదానం పరిసరాల్లోని 20 మార్కెట్లపై ర్యాలీ ప్రభావం చూపుతుందని వెల్లడి
- గత నెలలో జరిగిన ర్యాలీల వల్ల రూ. 3,000 కోట్లు నష్టపోయామని ఆవేదన
- నిరసన తెలిపే హక్కు ఉన్నప్పటికీ, పండగ తర్వాత ర్యాలీ నిర్వహించాలని కోరిక

ఢిల్లీ :

ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నవంబర్ 1న 'ఇండియా' కూటమి నిర్వహించ తలపెట్టిన భారీ ర్యాలీని వాయిదా వేయాలని వ్యాపార వర్గాలు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని కోరాయి. దీపావళి పండగ - మిగతా 2 లో

పసిఫిక్ మహాసముద్రంలో తొలిసారి 30 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు

- మరింత బలపడుతున్న ఎల్‌నినో!
- అక్టోబర్ 22న నమోదైన చారిత్రక ఉష్ణోగ్రత
- ఎల్‌నినో మరింత బలపడుతోందని డబ్ల్యూఎంఓ అంచనా
- డిసెంబర్ నాటికి గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం
- 2026 నైరుతి రుతుపవనాల్లో సాధారణం కంటే 13 శాతం తక్కువ వర్షపాతం
- ఎల్‌నినో ప్రభావం 2027 ఆరంభం వరకు కొనసాగే అవకాశం



ఢిల్లీ :

పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు చారిత్రక గరిష్ఠానికి చేరాయి. ఎల్‌నినో ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో భూమధ్య రేఖకు సమీపంలోని మధ్య పసిఫిక్ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు తొలిసారి 30 డిగ్రీల సెల్సియస్ మార్కును దాటాయి. అమెరికా జాతీయ సముద్ర, వాతావరణ పరిపాలనా సంస్థ (ఎన్ఓఏఏ) సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ఈ వివరాలను - మిగతా 2 లో



ఏపీ పరిషత్ పోరుకు పోటెత్తిన నామినేషన్లు

- నువ్వా నేనా అంటున్న టీడీపీ, వైసీపీ
- జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు భారీగా దాఖలైన నామినేషన్లు
- ఎంపీటీసీలకు 51,902, జెడ్పీటీసీలకు 5,724 నామినేషన్లు
- జగన్‌ది 'హిట్ అండ్ రన్' రాజకీయమంటూ విమర్శలు

అమరావతి :

ఏపీలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల పర్వం ముగిసింది. పరిషత్ పోరులో పోటీ చేసేందుకు అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల నుంచి భారీ ఎత్తున స్పందన లభించింది. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో ఉన్న 659 జెడ్పీటీసీ స్థానాలకు మొత్తం 5,724 నామినేషన్లు, 9,829 ఎంపీటీసీ స్థానాలకు ఏకంగా 51,902 నామినేషన్లు దాఖలయ్యాయి. - మిగతా 2 లో

షర్మిలకు జగన్ లేఖ



- మేనకోడలి పెళ్లికి బెంగళూరు ఇల్లు వద్దని స్పష్టీకరణ
- చెల్లెలు షర్మిలకు జగన్ రాసిన లేఖను బయటపెట్టిన వైసీపీ
- కుమార్తె పెళ్లి తన బెంగళూరు నివాసంలో వద్దని లేఖలో జగన్ స్పష్టీకరణ
- తీవ్రమైన భద్రతాపరమైన సమస్యలు తలెత్తుతాయని వివరణ
- ప్రత్యామ్నాయంగా హైదరాబాద్ లోటస్ పాండ్‌ను పరిశీలించాలని సూచన

అమరావతి :

వైసీపీ అధినేత జగన్ తన సోదరి షర్మిలకు రాసిన ఓ లేఖను ఆ పార్టీ తాజాగా విడుదల చేసింది. షర్మిల కుమార్తె అంజలి వివాహానికి సంబంధించి అక్టోబర్ 9న రాసిన ఈ లేఖలో, పెళ్లి వేదిక విషయంలో జగన్ తన అభ్యంతరాలను, కారణాలను స్పష్టంగా వివరించారు.మేనకోడలు అంజలి వివాహం జరగనుండటం పట్ల జగన్ తొలుత సంతోషం వ్యక్తం చేశారు. అయితే, ఈ వేడుకను బెంగళూరులోని తన నివాసంలో నిర్వహించాలని షర్మిల కుటుంబం భావిస్తున్నట్లు తెలిసిందని, కానీ అక్కడ ఈ కార్యక్రమం నిర్వహిస్తే తీవ్రమైన భద్రతాపరమైన సమస్యలు ఎదురవుతాయని ఆయన హెచ్చరించారు. - మిగతా 2 లో

ఏపీలో స్థానిక ఎన్నికల పోరు ఆసక్తికరంగా కుటుంబ రాజకీయాలు

- స్థానిక ఎన్నికల్లో కుటుంబ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి
- రక్త సంబంధీకులే పోటీపడుతున్న పరిస్థితులూ నెలకొన్నాయి
- ఒకే కుటుంబం నుంచి వేర్వేరు పదవులకు పోటీ చేస్తూ తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.
- రెండు ఎంపీటీసీ స్థానాలకు భార్యాభర్తలు పోట
- ఒకే కుటుంబానికి చెందిన నలుగురు నామినేషన్లు వేయడం చర్చనీయాంశంగా మారిందీ



అమరావతి :

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కుటుంబ రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఈసారి కుటుంబ సభ్యులే పరస్పరం బరిలో నిలిచారు. అన్నదమ్ములు, అత్తాకోడళ్లు, తోటి కోడళ్లు ఒకరిపై ఒకరు పోటీ పడుతున్నారు. వీరంతా వేర్వేరు పార్టీల తరపున పోటీ చేస్తూ తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఒకే కుటుంబానికి చెందిన నలుగురు నామినేషన్లు వేయడం చర్చనీయాంశంగా మారింది.అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలంలోని పడమటికోన ఎంపీటీసీ స్థానం నుంచి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తల్లి సుశీలమ్మ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. అదే స్థానానికి శుక్రవారం నాడు మండిపల్లి సతీమణి హరితమ్మ నామపత్రాలు సమర్పించారు. మంత్రి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలుగుదేశం తరపున జడ్పీటీసీ అభ్యర్థిత్వానికి నామినేషన్ వేయగా వరుసకు సోదరుడైన పి.దేవనాథరెడ్డి వైఎస్సార్సీపీ నుంచి నామినేషన్ వేశారు. పరిశీలన, ఉపసంహరణ తరవాత ఎవరెవరు పోటీలో ఉంటారనే విషయమై నియోజకవర్గంలో ఉత్కంఠ రేపుతోంది. సుశీలమ్మ, హరితమ్మల్లో ఎవరు బరిలో నిలిచినా వారే చిన్నమండెం ఎంపీపీ అభ్యర్థిగా ఉంటారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.నంద్యాల జిల్లా మిడుతూరు మండలంలోని నాగలూటి ఎంపీటీసీ స్థానానికి ఒకే కుటుంబం నుంచి అత్తాకోడళ్లు - మిగతా 2 లో

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
ఆదివారం 25 - 10 - 2026

సంపాదకీయం

విఫల రాష్ట్రం

ఒక రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్లకాలంలో ఒక సంక్షోభాన్ని పరిష్కరించలేకపోవడం ఎక్కడా లేదేమో. మణిపూర్‌లో పరిస్థితులు మెరుగుపడటానికి ముందే అవి మరింత దిగజారిపోతూంటాయి. చల్లారిందని అనుకుంటున్న మీతీ--కుకీ ఘర్షణలకు ఇప్పుడు అక్కడ మళ్ళీ తెరలేచింది. మీతీలు లక్ష్యంగా కుకీలు జరిపిన ఒక భీకరదాడిలో ముగ్గురు మరణించారు, అనేకులు గాయపడ్డారు. ఈ దాడి అనంతరం లోయలో నిరసనలు వెల్లువెత్తాయి, నలభై ఎనిమిదిగంటల బంద్ జరిగింది. కొన్నిచోట్ల ఘర్షణలు, పేలుళ్ళు సంభవించాయి, మీతీ సంఘాల హెచ్చరికలతో ప్రజల్లో అభద్రతాభావం పెరిగింది.మూడేళ్లక్రితం మొదలైన హింసలో మూడువందలకుపైగా ప్రాణాలు పోయాయి, 70,000 మంది నిరాశ్రయులైనారు. తీవ్రతలో కాస్తంత తేడావున్నా, అది ఇంకా కొనసాగుతూ, మణిపూర్‌లోని ప్రతి తెగనూ జాతినీ చుట్టుముట్టింది. తాత్కాలిక సరిహద్దులతో రాష్ట్రం జాతులు, మతాల ప్రాతిపదికన ప్రాంతాలుగా విడిపోయింది. శాంతిభద్రతలపై పట్టు సాధించడానికి ఖేమ్‌చంద్ ప్రభుత్వం నానాకష్టాలూ పడుతూంటే, రాష్ట్రంలో ఈ హింసకు మూలకారణమైన మీతీ కుకీల మధ్య ఇప్పుడు మళ్ళీ ఘర్షణ రేగింది. హత్యకు గురైనవారి మృతదేహాలతో మీతీలు ముఖ్యమంత్రి నివాసం ముందు నిరసనలు నిర్వహించి, పాలకుల సమర్థత మీద తమకు నమ్మకం లేదని ప్రకటించారు. మణిపూర్‌లో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం, గవర్నర్ పాలన రెండూ హింసను అరికట్టడంలో విఫలం కావడం విచిత్రం, విషాదం. మాజీ ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ ఏలుబడిలో రెండున్నరేళ్ళపాటు రాష్ట్రం మీతీ--కుకీ ఘర్షణలతో మండిపోయింది. ఆయన ప్రోద్బలం మేరకు భద్రతాబలగాలు, మీతీ తీవ్రవాద సంస్థలు కుకీలను ఊచకోత కోశాయి. మీతీల పక్షాన వ్యవహరిస్తూ ఆయన తెగలమధ్య వైరం పెంచుతున్నాడన్న వాస్తవం పలుమార్లు నిరూపణ అయింది. ఈ హింసావలయాన్ని ఛేదించాలంటే నాయకత్వాన్ని మార్చవలసిందేనన్న ఒత్తిడిపెరగడంతో, మరోపక్క బీరేన్‌ను తొలగించేందుకు విపక్షాలు తమ ప్రయత్నాలు ఉధృతం చేయడంతోనూ ఆఖరుక్షణాల్లో రాష్ట్రపతిపాలన విధించి ఆ రాష్ట్రం తమ చేజారిపోకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాపాడుకుంది. మీతీలకు ఆయుధాలు సమకూర్చవలసిందిగా ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న బీరేన్ తన అధికారులకు ఆదేశిస్తున్న ఆడియో ఒకటి బయటకు వచ్చి, సుప్రీంకోర్టు కూడా దానిని ధ్రువీకరించడం బీజేపీ అధిష్ఠానాన్ని ఇరకాటంలో పడవేసింది. బీరేన్‌ను తప్పించి, ఏడాది పాటు రాష్ట్రపతిపాలన అమలు చేసినప్పుడు కూడా రాష్ట్రంలో అరాచకాలు కొనసాగాయి. మీతీయేతర జాతుల్లో బీజేపీ పట్ల అవిశ్వాసం అధికంగా ఉన్న నేపథ్యంలో, సౌమ్యుడిగా, అందరికీ ఆమోదయోగ్యుడుగా పేరున్న ఖేమ్‌చంద్‌ను సీఎం చేసి, నాగా, కుకీల నుంచి ఇద్దరిని ఉపముఖ్యమంత్రులను చేయడంతో రాష్ట్రం గాడినపడవచ్చునన్న అభిప్రాయం కలిగింది. కానీ, ఖేమ్‌చంద్ నాయకత్వంలో నాగా--కుకీ ఘర్షణలు మొదలై, నాలుగునెలల్లోనే తీవ్రస్థాయికి చేరి, ఉపముఖ్యమంత్రులు ఇద్దరూ పరస్పరం ఆరోపణలు చేసుకోవడం ప్రారంభించారు.20రోజుల క్రితమే అక్కడ సాయుధదళాల ప్రత్యేకాధికారాల చట్టం అమలును మరో ఆర్నెల్లపాటు పొడిగించి, కల్లోలితప్రాంతంగా దాని గుర్తింపును కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మణిపూర్‌ను దారికి తీసుకురావడంలో తాము విఫలం చెందామని పాలకులే ఒప్పుకున్నట్టు దేశానికి అనిపించింది. ఓ పదమూడు పోలీసు స్టేషన్ల పరిధి మినహా మిగతా రాష్ట్రమంతా కల్లోలంగానే ఉందని ఈ నిర్ణయం అర్థం. నాగా--కుకీల మధ్య వరుసబెట్టి సాగుతున్న దాడులు నివారించడం సాధ్యం కాకపోవడంతో ప్రభుత్వం ఈ నిర్ణయానికి వచ్చివుండవచ్చు. ఖేమ్‌చంద్ పాలనలో నాగా--కుకీ ఘర్షణలు రేగడం వెనుక కూడా రాజకీయ కుట్రలున్నాయన్న విమర్శను అటుంచితే, బీరేన్ నిష్క్రమణతో తగ్గుముఖం పట్టాయనుకుంటున్న మీతీ--కుకీ ఘర్షణలు ఇప్పుడు మళ్ళీ మొదలుకావడం అత్యంత భయం కొల్పే పరిణామం. అప్పటి మాదిరిగా గ్రామాలకు గ్రామాలు తగలబడటం, మహిళలపై సామూహిక అత్యాచారాలు జరగడం వంటి ఘోరమైన పరిస్థితులు మళ్ళీ తలెత్తకుండా ప్రభుత్వం నిష్పక్షపాతంగా, నిర్దయగా వ్యవహరించడం అవసరం. ఓట్ల లెక్కలను, రాజకీయ అవసరాలను పక్కనబెట్టి, యుద్ధభూమిగా మారిన ఈ రాష్ట్రంలో దేశప్రయోజనాలదృష్ట్యా వ్యవహరించాలి. కేంద్రప్రభుత్వం మణిపూర్‌మీద పూర్తిగా దృష్టినిలిపి ఈ నిత్య సంఘర్షణను అంతం చేయాలి. మణిపూర్‌ను కల్లోలిత ప్రాంతంగా ఉంచడం, కొనసాగించడం ప్రమాదం.

‘ఇండియా’ కూటమి ర్యాలీ వద్దు

మొదటిపేజీ తరువాయి - సీజన్‌లో ఈ ర్యాలీ నిర్వహిస్తే సుమారు రూ.10,000 కోట్ల మేర వ్యాపార నష్టం వాటిల్లుతుందని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి సీటీఐ చైర్మన్ బ్రిజేష్ గోయల్ లేఖ రాశారు.పండగ సీజన్‌ను దృష్ట్యాలో ఉంచుకుని నవంబర్ 10 తర్వాత ర్యాలీని నిర్వహించాలని ఆయన ఆ లేఖలో సూచించారు. నవంబర్ 6న ధంతేరస్, నవంబర్ 8న దీపావళి ఉన్న నేపథ్యంలో కొనుగోళ్ల కోసం ప్రజలు భారీగా మార్కెట్లకు వస్తారని, ఈ సమయంలో ర్యాలీ నిర్వహిస్తే వాణిజ్య కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. దీపావళి పండగ వేళ ఢిల్లీ వ్యాప్తంగా బంగారం, వెండి, ఎలక్ట్రానిక్స్, వస్త్రాలు, గృహోపకరణాలు, డ్రై ఫ్రూట్స్, స్వీట్లు, వాహనాలు, స్థిరాస్తి, గిఫ్ట్ ఆర్టికల్స్ వంటి అన్ని రంగాల్లో కలిపి సుమారు రూ.25,000 కోట్ల మేర వ్యాపారం



జరుగుతుందని సీటీఐ అంచనా వేసింది.రామ్‌లీలా మైదానానికి ఐదు కిలోమీటర్ల పరిధిలోనే చాందినీ చౌక్, సదర్ బజార్ వంటి సుమారు 20 హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లు ఉన్నాయని, ర్యాలీ కారణంగా విధించే ట్రాఫిక్ ఆంక్షలతో ఈ ప్రాంతమంతా స్తంభించిపోయే ప్రమాదం ఉందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత అక్టోబర్ మాసంలో సెంట్రల్ ఢిల్లీలో జరిగిన పలు ర్యాలీలు, రహదారుల మూసివేత వల్ల ఇప్పటికే వ్యాపారులు రూ.3,000 కోట్ల వరకు నష్టపోయారని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు.ఓటర్ల జాబితా సవరణలో “ఓట్ల చోరీ” జరిగిందన్న ఆరోపణలతో, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ‘ఇండియా’ కూటమి ఈ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. అయితే, శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును తాము గౌరవిస్తామని, పండగ సీజన్ ముగిసే వరకు వాణిజ్య ప్రాంతాలకు దూరంగా ర్యాలీలు నిర్వహించాలని సీటీఐ రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేసింది.

పసిఫిక్ మహాసముద్రంలో తొలిసారి 30 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు

మొదటిపేజీ తరువాయి -

వెల్లడించారు. అక్టోబర్ 22న ఈ ప్రాంతంలో ఉష్ణోగ్రత 30 డిగ్రీలకు చేరినట్లు ‘ఇండియా టుడే’ తెలిపింది. అందుబాటులో ఉన్న రికార్డుల ప్రకారం, ఈ స్థాయికి చేరడం ఇదే తొలిసారి. ఎల్‌నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ఉష్ణమండల ప్రాంతాల్లో సముద్ర ఉపరితల జలాలు సాధారణం కంటే ఎక్కువగా వేడెక్కే సహజ వాతావరణ పరిణామం. దీనివల్ల సముద్రంపై వీచే గాలులు, మేఘాల కదలికలు, వర్షపాత నమూనాల్లో మార్పులు వస్తాయి. ఈ ప్రభావం పసిఫిక్ ప్రాంతానికే పరిమితం కాకుండా ప్రపంచంలోని పలు దేశాల వాతావరణంపైనా పడుతుంది. కొన్ని ప్రాంతాల్లో కరవు, అధిక ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉండగా.. మరికొన్ని చోట్ల భారీ వర్షాలు, వరదల ముప్పు పెరుగుతుంది.ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) అంచనాల ప్రకారం.. 2026 అక్టోబర్–డిసెంబర్ మధ్య ఎల్‌నినో మరింత బలపడే అవకాశం ఉంది. డిసెంబర్ నాటికి ఇది గరిష్ఠ స్థాయికి చేరవచ్చని అంచనా వేస్తున్నారు. ఎల్‌నినో తీవ్రతను అంచనా వేయడానికి శాస్త్రవేత్తలు ఉపయోగించే నినో 3.4 సూచీలో సముద్ర ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే జూన్‌లో 1.6 డిగ్రీలు, ఆగస్టులో 2.5 డిగ్రీలు అధికంగా నమోదయ్యాయి. అక్టోబర్–డిసెంబర్ కాలానికి ఈ వ్యత్యాసం 3.7 డిగ్రీలకు చేరవచ్చని డబ్ల్యూఎంఓ అంచనా వేసింది. ఇది గతంలో నమోదైన గరిష్ఠ స్థాయి కంటే ఎక్కువ. అయితే ఈ సంఖ్యలు సముద్రం వాస్తవ ఉష్ణోగ్రతను కాకుండా, దీర్ఘకాలిక సగటుతో పోలిస్తే ఎంత ఎక్కువగా ఉందో సూచిస్తాయి. భారత్‌పైనా ఈ పరిణామాల ప్రభావం ఉండొచ్చని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. 2026లో నైరుతి రుతుపవనాల సీజన్ సాధారణం కంటే 13 శాతం తక్కువ వర్షపాతంతో ముగిసింది. అక్టోబర్–డిసెంబర్ మధ్య దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. అయితే దక్షిణ ద్వీపకల్ప ప్రాంతంలో మొత్తం మీద సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశముందని తెలిపింది. ప్రాంతాలవారీగా పరిస్థితులు మారవచ్చని, ఎల్‌నినో ఒక్కటే భారత వాతావరణాన్ని నిర్ణయించదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మరోవైపు, సముద్రాలు ఇప్పటికే అసాధారణంగా వేడెక్కుతున్న నేపథ్యంలో బలమైన ఎల్‌నినో ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలను మరింత పెంచే ప్రమాదం ఉందని డబ్ల్యూఎంఓ హెచ్చరించింది. ఈ ప్రభావం 2027 ఆరంభం వరకు కొనసాగవచ్చని అంచనా వేస్తోంది. అయితే దీని తీవ్రత, వర్షపాతంపై ప్రభావం ప్రాంతాన్ని బట్టి మారుతుంది. అందువల్ల రాబోయే నెలల్లో సముద్ర ఉష్ణోగ్రతలు, గాలుల దిశ, వర్షపాత అంచనాలను శాస్త్రవేత్తలు నిరంతరం పరిశీలించనున్నారు.

మహారాష్ట్రతో తుమ్మిడిహట్టి బ్యారేజీ ఎత్తుపై చర్చలు

మొదటిపేజీ తరువాయి - పూర్తి వివరాలను సిద్ధం చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. బ్యారేజీ ఎత్తుపై స్పష్టత వచ్చిన తర్వాత తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి వరకు నీటిని తెచ్చే ప్రాజెక్టు రూట్ డిజైన్లు, భూసేకరణపై దృష్టి సారించాలని ఇరిగేషన్ ఇంజినీర్లను సీఎం ఆదేశించారు.గతంలో 148 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర అంగీకరించిందని, అయితే అంత తక్కువ ఎత్తున బ్యారేజీ నిర్మిస్తే ఆశించినంత నీటిని తెచ్చుకొనే వీల్లేదని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే 152 మీటర్ల ఎత్తున బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు సిద్ధమవుతోంది. అందుకు అవసరమైన సాంకేతిక నివేదికలు, నీటి లభ్యత, ముంపు విస్తీర్ణం, ఇతర అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలను సిద్ధంగా ఉంచాలని ఇప్పటికే అధికారులకు సూచించారు. మహారాష్ట్రతో చర్చల సందర్భంగా తెలంగాణ నీటి అవసరాలు, వాదనలను సమర్థవంతంగా వివరించనున్నారు.మరోవైపు రాష్ట్ర ప్రజల కష్టాలకు కారణమైన బీఆర్ఎస్ నేతలే ప్రస్తుతం అబద్ధాలు చెబుతున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. కేవలం కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టును కట్టారని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలోనే మేడిగడ్డ బ్యారేజ్ కూలిపోయిందని, కేసీఆర్ తీరు వల్ల రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ పాలనలో ఇరిగేషన్ ప్రాజెక్టులను సర్వనాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో పరిస్థితులు ఉన్నాయని, అయినా రాష్ట్ర ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.‘ ‘మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల నిర్మాణంలో సీకెంట్ పైల్స్ వాడారు. సీకెంట్ పైల్స్ వాడకం వల్లే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో సమస్యలు వచ్చాయి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో గేట్లు మూయవద్దని ఎన్‌డీఎస్ఏ చెప్పింది. బ్యారేజీల గేట్లు మూయకుంటే పంపులు రన్ చేసే అవకాశమే లేదు. కన్నెపల్లి నుంచి నీరు ఎత్తిపోయాలని బీఆర్ఎస్ నేతలు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. బ్యారేజీ నిర్మాణానికి ఎంత కాంక్రీట్ అవసరమైందో, అంతే కాంక్రీట్ మరమ్మతులకు అవసరం.ఎల్‌నినో



వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులకు కారణం బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు చేసే విషప్రచారాన్ని ప్రజలు నమ్మే స్థితిలో లేరని మంత్రి పేర్కొన్నారు.

ఏపీలో స్థానిక ఎన్నికల పోరు

మొదటిపేజీ తరువాయి - పోటీ చేస్తున్నారు. వైఎస్సార్సీపీ తరపున అత్త బిపాషా పోటీ పడుతుండగా అదే స్థానానికి మరిది కోడలైన షాహీన్ తెలుగుదేశం తరపున పోటీ పడుతున్నారు. షాహీన్ గురువారం నామినేషన్ వేయగా, అత్త బిపాషా శుక్రవారం నామపత్రాలు దాఖలు చేశారు.శ్రీకాకుళం జిల్లాలో కంచిలి మండలంలో తెలుగుదేశం తరపున రెండు ఎంపీటీసీ స్థానాలకు భార్యాభర్తలు పోటీచేస్తున్నారు. కొక్కిలిపుట్టుగ ప్రాదేశికానికి మాదిన రామారావు, శ్రీరాంపురం స్థానానికి మాదిన విమల శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆమదాలవలస మండలంలో కలివరం ఎంపీటీసీ స్థానానికి తోటి కోడళ్లు బరిలో నిలిచారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం పెద్దన్నయ్య తమ్మినేని విజయవర్ధన్‌రావు భార్య శారద వైఎస్సార్సీపీ తరపున ఎంపీటీసీ స్థానానికి నామపత్రాలు సమర్పించారు. రెండో అన్నయ్య తమ్మినేని శ్యామలరావు భార్య, మాజీ ఎంపీపీ భారతి తెలుగుదేశం నుంచి బరిలో నిలిచారు. వీరి కుమార్తె తమ్మినేని సుజాత ఆమదాలవలస జడ్పీటీసీ అభ్యర్థిగా శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు.

షర్మిలకు జగన్ లేఖ

మొదటిపేజీ తరువాయి - భద్రత, వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన అంశాలను విస్మరించవద్దని షర్మిలను కోరారు.బెంగళూరులోని ఇల్లు తన కుటుంబ నివాసమని, అక్కడ తాము సురక్షితంగా ఉండాల్సిన అవసరం ఉందని జగన్ నొక్కిచెప్పారు. తన సొంత పిల్లల వివాహం విషయంలో కూడా భద్రత దృష్ట్యా తాను ఇలాంటి నిర్ణయమే తీసుకుంటానని స్పష్టం చేశారు. ఈ విషయంలో తన ఇబ్బందులను ఇప్పటికే కొందరి ద్వారా తెలియజేసినా, తన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోక పోవడం బాధ కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు.తన పరిస్థితిని అర్థం చేసుకొని, దయచేసి మరో వేదికను ఎంచుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అవసరమైతే హైదరాబాద్‌లోని లోటస్ పాండ్ లోనైనా వివాహం జరుపుకోవచ్చని సూచించారు. అంజలి వివాహ ఏర్పాట్లకు సంబంధించి జరుగు తున్న చర్చల నేపథ్యంలో, జగన్ వైఖరిని స్పష్టం చేసేందుకే వైసీపీ ఈ లేఖను విడుదల చేసినట్లు తెలుస్తోంది.

ఏపీ పరిషత్ పోరుకు పోటెత్తిన నామినేషన్లు

మొదటిపేజీ తరువాయి - నామినేషన్ల చివరి రోజున అత్యధికంగా జెడ్పీటీసీలకు 3,315, ఎంపీటీసీలకు 25,016 నామినేషన్లు రావడం ఎన్నికల వేడిని సూచిస్తోంది.నామినేషన్ల దాఖలులో అధికార, ప్రతిపక్ష పార్టీలు నువ్వా నేనా అన్నట్లు పోటీపడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎంపీటీసీ స్థానాలకు టీడీపీ తరపున అత్యధికంగా 22,013 నామినేషన్లు దాఖలు కాగా, వైసీపీ నుంచి 20,556 మంది నామినేషన్లు వేశారు. ఇక జనసేన పార్టీ తరపున 4,609 మంది, బీజేపీ నుంచి 1,150 మంది తమ అభ్యర్థిత్వాలను నమోదు చేసుకున్నారు.అదేవిధంగా, జెడ్పీటీసీ స్థానాలకు కూడా ప్రధాన పార్టీల మధ్య గట్టి పోటీ నెలకొంది. టీడీపీ తరపున 2,078 నామినేషన్లు దాఖలు కాగా, వైఎస్ఆర్సీపీ నుంచి 1,815 మంది బరిలో నిలిచారు. కూటమిలోని జనసేన పార్టీ నుంచి 679 మంది, బీజేపీ తరపున 255 మంది నామినేషన్లు వేశారు.ఇంత భారీ సంఖ్యలో ప్రజాస్వామ్యబద్ధంగా నామినేషన్లు దాఖలైనప్పటికీ, కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అధికార పార్టీ నేతలు మండిపడుతున్నారు. జగన్ తీరును ‘హిట్ అండ్ రన్’ థియరీగా వారు అభివర్ణిస్తున్నారు.కేవలం ప్రెస్ మీట్లు పెట్టడానికే బెంగళూరు నుంచి అమరావతికి వస్తున్నారని, నిరాధార ఆరోపణలు చేసి తిరిగి వెళ్లిపోతున్నారని కూటమి పార్టీల నేతలు విమర్శిస్తున్నారు. క్షేత్రస్థాయి వాస్తవాలను గమనించకుండా జగన్ వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. మొత్తం మీద నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో పరిషత్ ఎన్నికల రాజకీయం మరింత వేడెక్కింది.

అల్లూరి జిల్లాలో పేలుడు ప్రమాదం

మొదటిపేజీ తరువాయి - పనుల కోసం కొండను పేల్చే క్రమంలో జరిగిన పేలుడులో ఐదుగురు మరణించగా, పలువురు గాయపడ్డారు.వివరాల్లోకి వెళితే.. అనంతగిరి మండలం పినకోట సమీపంలో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా కొండను తొలగించేందుకు కార్మికులు జిలెటిన్ స్టిక్స్‌ను ఉపయోగించి పేలుడుకు సిద్ధమ య్యారు. అదే సమయంలో అటుగా వస్తున్న ఓ టిప్పర్ లారీ పేలుడు ధాటికి అదుపుతప్పి బోల్తా పడింది.ఈ దుర్ఘటనలో ఒక టీచర్, టిప్పర్ డ్రైవర్‌తో పాటు ముగ్గురు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న వెంటనే అధికారులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతులను టీచర్ సునీత (వైజాగ్), మణి (దేవరాపల్లి), నారాయణ రావు (చీడికాడ), పవన్ కుమార్ (కడప)గా గుర్తించారు. మరొకరి వివరాలు తెలియాల్సి ఉంది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



హైదరాబాద్‌కు నీటి గండం

మొదటిపేజీ తరువాయి - నీటిమట్టాలు గణనీయంగా పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. తాగునీటి సరఫరాపై ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుండటంతో, నీటిని పొదుపుగా వాడుకోవాలని నగరంలోని రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు పౌరులకు విజ్ఞప్తి చేస్తున్నాయి.మణికొండలోని పంచవటి సాయి లక్ష్మి కాలనీలో ఒక వ్యక్తి సైకిల్‌పై లౌడ్‌స్పీకర్‌తో అవగాహన కల్పిస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కార్లు, సెల్లార్లు, రోడ్లు, టెర్రస్‌లు శుభ్రం చేసేందుకు కుళాయి లేదా బోర్ నీటిని వృథా చేయవద్దని ఆయన నినదిస్తున్న తీరు, నగరంలో నెలకొన్న నీటి ఎద్దడి తీవ్రతను కళ్లకు కడుతోంది.రాష్ట్రంలో నెలకొన్న ఈ క్లిష్ట పరిస్థితులను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా అంగీకరించింది. ఈ ఏడాది సాధారణం కంటే 27 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, ఫలితంగా రాష్ట్రంలోని 621 మండలాలకు గాను 324 మండలాల్లో భూగర్భ జలాలు అట్టడుగుకు పడిపోయాయని నివేదికలు వెల్లడిస్తున్నాయి. కొన్ని రిజర్వాయర్లలో నీటి నిల్వలు 20 శాతం కంటే తక్కువకు చేరుకున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా తెలిపారు. ప్రస్తుత తరుణంలో సాగునీటి కంటే ప్రజలు, పశువులు, ఇతర జీవరాశుల తాగునీటి అవసరాలకే ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు.ప్రస్తుతం రాష్ట్రంలోని జలాశయాల్లో 30 నుంచి 40 శాతం మేర నీటి నిల్వలు ఉన్నాయని, 2027 జూలై వరకు తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడటమే తమ ప్రథమ కర్తవ్యమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పులు, నీటి పొదుపు ఆవశ్యకతపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. నీటి సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించేందుకు త్వరలోనే ఒక ప్రత్యేక టోల్-ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

సివిల్స్ కోచింగ్ విద్యార్థులకు అండగా తెలంగాణ ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి - ప్రభుత్వం శు భవార్త చెప్పింది. హైదరాబాద్‌లోని సైదాబాద్ బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందుతున్న 100 మంది అభ్యర్థులకు అందించే ఆర్థిక సాయాన్ని గణనీయంగా పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. పెంచిన మొత్తాలను వచ్చే నెల నుంచే అమలు చేయనున్నట్లు ప్రకటించింది. వివరాల్లోకి వెళితే, సివిల్స్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులకు ఇప్పటివరకు నెలకు రూ.5,000గా ఉన్న స్టైఫండ్‌ను రూ.7,000కు పెంచారు. అదేవిధంగా, పుస్తకాల కొనుగోలు కోసం ఒకేసారి ఇచ్చే బుక్ ఫండ్‌ను రూ.5,000 నుంచి ఏకంగా రూ.10,000కు రెట్టింపు చేశారు. ఈ పెంచిన మొత్తాలను విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తెలిపారు. ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు.ప్రస్తుతం సైదాబాద్ కేంద్రంలో 100 మంది విద్యార్థులకు మూడేళ్ల సమగ్ర సివిల్స్ శిక్షణ అందిస్తున్నామని, మరో 100 మందికి ఇతర పోటీ పరీక్షల కోసం ఫౌండేషన్ కోర్సులలో శిక్షణ ఇస్తున్నామని హరికృష్ణ పేర్కొన్నారు. అభ్యర్థులు ప్రైవేట్ స్టడీ హాళ్ల కోసం డబ్బు వృథా చేయకుండా, స్టడీ సర్కిల్ లైబ్రరీ వేళలను కూడా పొడిగించినట్లు తెలిపారు. ఇకపై లైబ్రరీ ఉదయం 7 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



46 ఆర్థిక అంశాలపై పార్లమెంటరీ కమిటీ అధ్యయనం

మొదటిపేజీ తరువాయి - ఆర్థిక సంవత్సరంలో పరిశీలనకు ఎంపిక చేసింది. ఈ అంశాలపై అధ్యయనం చేసి నివేదికలు సిద్ధం చేయనున్నట్లు లోక్‌సభ బులెటిన్ వెల్లడించింది.లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ నెల ప్రారంభంలో వివిధ మంత్రిత్వ శాఖలకు సంబంధించిన పార్లమెంటరీ కమిటీలను పునర్వ్యవస్థీకరించారు. ఈ క్రమంలో ఆర్థిక వ్యవహారాల స్థాయీ సంఘానికి బీజేపీ ఎంపీ భర్తృహరి మహతాబ్‌ను మరోసారి ఛైర్మన్‌గా నియమించారు. ఈ కమిటీలో లోక్‌సభ నుంచి 21 మంది, రాజ్యసభ నుంచి 10 మంది సభ్యులు ఉన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక వ్యవహారాలు, వ్యయం, ప్రభుత్వ రంగ సంస్థలు, పెట్టుబడులు-ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ, రెవెన్యూ, ఆర్థిక సేవల విభాగాలతో పాటు మరికొన్ని కీలక సంస్థలకు సంబంధించిన అంశాలను కమిటీ పరిశీలించనుంది. ధరల స్థిరత్వం, రూపాయి విలువ, ఆర్థిక నియంత్రణ వ్యవస్థలు, ప్రభుత్వ ఆస్తుల వినియోగం వంటి అంశాలపైనా కమిటీ దృష్టి సారించనుంది. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, నీతి ఆయోగ్, గణాంకాలు-కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖలకు సంబంధించిన అంశాలు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. ఆయా రంగాల్లో విధానాల అమలు, పనితీరు, సంస్కరణల అవసరాన్ని అంచనా వేయడం ఈ అధ్యయనాల ప్రధాన ఉద్దేశం.డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో వర్చువల్ డిజిటల్ ఆస్తులపై కమిటీ ప్రత్యేకంగా అధ్యయనం చేయనుంది. క్రిప్టో ఆస్తులకు సంబంధించిన ప్రస్తుత పరిస్థితులు, వాటి భవిష్యత్తు, ఈ రంగంలో అనుసరించాల్సిన విధానాలపై పరిశీలన చేపట్టనుంది. ఆర్థిక రంగంలో కృత్రిమ మేధ వినియోగం వల్ల కలిగే అవకాశాలు, ఎదురయ్యే సమస్యలను కూడా అధ్యయనం చేయనుంది. బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, డిజిటల్ లావాదేవీలు వంటి విభాగాల్లో కొత్త సాంకేతికత వినియోగం పెరుగుతున్నందున సంబంధిత అంశాలపై సమగ్ర విశ్లేషణకు ప్రాధాన్యత ఇవ్వనుంది. అదే సమయంలో ఆర్థిక రంగంలో నియంత్రణ వ్యవస్థల పనితీరు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) రంగంలో ఉన్న నియంత్రణ లోపాలను ప

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
ఆదివారం 25 - 10 - 2026

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



కంబదూరు (తెలుగు కలం) అక్టోబర్ 24 : ప్రతినిధి : కంబదూరు మండల కేంద్రంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అప్పుల బాధ తాళలేక వడ్డే శంకర్ అనే వ్యక్తి గ్రామ చివర్లోని కొండ ప్రాంతంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శనివారం తెల్లవారుజామున వెలుగు చూసింది. కొద్ది నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో శంకర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆ చికిత్స ఖర్చులతో పాటు పిల్లల చదువుల నిమిత్తం ఆయన సుమారు రూ.6 లక్షలు అప్పు చేసినట్లు సమాచారం. చేసిన అప్పులను తీర్చే మార్గం ఏదీ కనిపించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబానికి ఏకైక ఆధారమైన శంకర్ అకస్మిక మృతితో ఆ కుటుంబం ప్రస్తుతం దిక్కుతోచని స్థితిలో రోదున పడింది. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. సమాచారం అందుకున్న వెంటనే స్థానిక ఎస్ఐ లోకేష్ కుమార్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఈవీఎం గోదాములను తనిఖీ చేసిన

అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్



అనంతపురం (తెలుగు కలం) అక్టోబర్ 24 : భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న క్రమబద్ధమైన మాసవారీ తనిఖీల్లో భాగంగా స్థానిక క్లాక్ టవర్ సమీపంలోని పాత ఆర్డీఓ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోదాములను శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఆయన అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి మాలోలతో కలిసి పాల్గొని గోదాముల డోర్ లాక్ సీళ్ల భద్రతా స్థితిని క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రస్తుతం గోదాముల్లో అమలవుతున్న ఈవీఎంల రక్షణ చర్యలు, భద్రతా ప్రమాణాలు ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉన్నాయో లేదో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ?ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గోదాముల వద్ద భద్రతా విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. అనంతరం పోలీసు లాగ్ బుక్‌తో పాటు సీసీటీవీ పర్యవేక్షణ వ్యవస్థ పనితీరు, నిరంతర విద్యుత్ సరఫరా మరియు అగ్నిమాపక పరికరాల అందుబాటుపై ఆరా తీశారు. ఏవైనా లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, ఎన్నికల విభాగం డిప్యూటీ తాసిల్దార్ కనకరాజు, సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్ బెంజమిన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

చేస్తాం కాచర్ల ఆంజనేయులు, బుడగ వెంకటనారాయణ



ధర్మవరం (తెలుగు కలం) అక్టోబర్ 24 : ప్రతినిధి : ధర్మవరం పట్టణంలోని రెండవ వార్డులో మున్సిపల్ ఎన్నికల ప్రచారం హోరెత్తింది. వైఎస్సార్సీపీ బలపరిచిన సీపీఐ కౌన్సిలర్ అభ్యర్థి బుడగ వెంకటనారాయణతో కలిసి వైఎస్సార్సీపీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి కాచర్ల ఆంజనేయులు, సీపీఐ, వైఎస్సార్సీపీ ముఖ్య నాయకులు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి ఇబ్బందుల గురించి వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ, సీపీఐ నాయకులు మాట్లాడుతూ, రెండవ వార్డును సమగ్రంగా అభివృద్ధి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. వార్డులో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామని, వార్డులో ఏ సమస్య వచ్చినా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి తక్షణమే స్పందిస్తామని తెలిపారు. ఓటు ఎంతో విలువైనదని పేర్కొంటూ, వార్డు అభివృద్ధిని మరియు ప్రజల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాబోయే మున్సిపల్ ఎన్నికలలో కంకి కొడవలి గుర్తుకే తమ అమూల్యమైన ఓటు వేసి, భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు జయరాం రెడ్డి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు, సీపీఐ పార్టీ నాయకులు జింక చలపతి, సీపీఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్, సహాయ కార్యదర్శి ఎర్రంశెట్టి రమణ పాల్గొని అభ్యర్థి విజయం కోసం ప్రచారం చేశారు. వారితో పాటు చేనేత కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకటస్వామి, యువజన సంఘం జిల్లా కార్యదర్శి సకల రాజా, సీపీఐ పట్టణ సహ కార్యదర్శి శ్రీనివాసులు, చెన్నంపల్లి శ్రీనివాసులు, వైఎస్సార్సీపీ నాయకులు జరి ప్రసాద్, ధనుంజయ, రమణ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, శీలా విజయ్, మహిళా సమాఖ్య నాయకురాలు లింగమ్మ, ఆదినారాయణ, రాజా, శ్రీనివాసులు, విజయ్ భాస్కర్, విజయ్, శివ మోహన, వెంకటేష్, నారాయణస్వామి, క్రిష్ణ తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో

పటిష్ట ఏర్పాట్లు చేయాలి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



అనంతపురం (తెలుగు కలం) అక్టోబర్ 24 : జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో భద్రతతో పాటు అన్ని రకాల ఏర్పాట్లు అత్యంత పటిష్టంగా ఉండాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ ఆదేశించారు. శనివారం అనంతపురం నగరంలోని జేఎన్టీయూ కళాశాలలో ఏర్పాటు చేసిన జడ్పిటిసి / ఎంపిటిసి ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని, స్ట్రాంగ్ రూమ్ ని జిల్లా ఎస్పీ పి.జగదీష్, అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్ లతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాల మ్యాప్ సహాయంతో అందుబాటులో ఉన్న గదులు, కౌంటింగ్ కేంద్రాల విస్తరణ, స్ట్రాంగ్ రూమ్‌ల కేటాయింపు తదితర అంశాలపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తనిఖీ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియ సుఫీనంగా జరిగేందుకు స్ట్రాంగ్ రూములలో తప్పనిసరిగా సిసిటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, వాటి ప్రత్యక్ష ప్రసారాన్ని (ఫీడ్) కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రం పరిసరా ప్రాంతాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు మోహరించాలని స్పష్టం చేశారు. అలాగే, పరి పరిపాలనా ఏర్పాట్లను నిశితంగా పరిశీలిస్తూ అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించాలని, కౌంటింగ్ ప్రాంగణంలో క్రమశిక్షణ కోసం బ్యారీకేడింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ఏర్పాట్లన్నీ సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి కరుణాకర్ రావు, డిడిఓ శకుంతల మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కూటమిలో సీట్ల లొల్లి.. గుంతకల్లులో గందరగోళం...!

బీ-ఫారాలు ఇచ్చినా కొలిక్కిరాని వార్డుల పంచాయితీ..

జనసేన, బీజేపీకి సీట్లు దక్కేనా?

ఫ్రెండ్లీ పోటీకి గ్రీన్‌సిగ్నల్ వస్తుందా?

రెబల్స్ బరిలోకి దిగితే పరిణామాలేంటి?



గుంతకల్లు (తెలుగు కలం) అక్టోబర్ 24 : గుంతకల్లు మున్సిపల్ ఎన్నికల్లో కూటమి సీట్ల పంపకాల వ్యవహారం కొత్త చర్చకు తెరలేపుతోంది. పొత్తులో భాగంగా ఎవరికి ఎన్ని వార్డులు కేటాయించారనే అంశంపై స్పష్టత లేకపోవడంతో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. అభ్యర్థుల ఎంపిక, బీ-ఫారాల పంపిణీపై భిన్నమైన సంకేతాలు వెలువడుతుండటంతో పార్టీ నాయకులకే కాకుండా ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించే అధికారుల్లోనూ అయోమయ పరిస్థితి ఏర్పడినట్లు తెలుస్తోంది.అందిన సమాచారం ప్రకారం తెలుగుదేశం పార్టీకి 46, జనసేనకు 7, బీజేపీకి 4 బీ-ఫారాలు జారీ అయినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ సంఖ్యల వెనుక అసలు సీట్ల సర్దుబాటు ఎలా ఉందన్నది మాత్రం స్పష్టంగా తెలియడం లేదు. బీ-ఫారాలు అందుకున్న అభ్యర్థులకు ఆయా వార్డుల్లో పోటీ చేసే అవకాశం ఖరారైందా? లేక ఇంకా మార్పులు జరిగే అవకాశముందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

జనసేన, బీజేపీకి ఎదురుచూపులేనా? :-

కూటమిలో భాగస్వాములుగా ఉన్న జనసేన, బీజేపీ నాయకులు ఆశిస్తున్న వార్డులు వారికి దక్కుతాయా లేదా అన్నదానిపై సందిగ్ధత కొనసాగుతోంది. జనసేనకు ఏడు, బీజేపీకి నాలుగు సీట్లు కేటాయిస్తారనే అంచనాలు ఉన్నప్పటికీ, తుది నిర్ణయంపై స్పష్టత లేకపోవడంతో ఆయా పార్టీల ఆశావహుల్లో ఆందోళన కనిపిస్తోంది. చివరి నిమిషంలో సీట్ల కేటాయింపులు మారితే తమ రాజకీయ భవిష్యత్తు ఏమిటన్న ఆలోచనలో కొందరు అభ్యర్థులు ఉన్నట్లు చర్చ సాగుతోంది.

ఒకే వార్డులో కూటమి పార్టీల పోటీ తప్పదా? :-

సీట్ల పంపకాలపై ఏకాభిప్రాయం కుదరకపోతే టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు ఒకే వార్డులో ప్రత్యర్థులుగా నిలిచే పరిస్థితి వస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది. ఫ్రెండ్లీ పోటీకి అధిష్ఠానం అనుమతిస్తుందా? లేక ఒక పార్టీ అభ్యర్థి మరొకరికి మద్దతుగా తప్పుకోవాల్సి వస్తుందా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. కూటమి పార్టీల మధ్య పోటీ నెలకొంటే ఓట్ల చీలికతో రాజకీయ సమీకరణాలు మారే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రెబల్స్‌పై హెచ్చరికలు పనిచేసేనా? :-

పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా రెబల్ అభ్యర్థులుగా లేదా స్వతంత్రులుగా పోటీ చేయవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించిన నేపథ్యంలో అసంతృప్త నేతల తదుపరి అడుగులపై ఆసక్తి నెలకొంది. ఆశించిన టికెట్ దక్కకపోతే పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటారా? లేక స్వతంత్రంగా బరిలోకి దిగి తమ బలాన్ని నిరూపించుకునేందుకు ప్రయత్నిస్తారా? అన్నది వేచి చూడాలి.

అధికారిక ప్రకటనతోనే గందరగోళానికి తెర :-

వార్డుల కేటాయింపుపై స్పష్టత లేకపోవడం అభ్యర్థులకే కాకుండా ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వర్గాల్లోనూ సందేహాలకు కారణమవుతోంది. ఏ వార్డులో ఏ పార్టీ అభ్యర్థి పోటీ చేస్తారనే అంశంపై తుది సమాచారం అందితేనే పరిస్థితి స్పష్టమయ్యే అవకాశం ఉంది. అధిష్ఠానం నుంచి అధికారిక ప్రకటన వెలువడకపోవడంతో గందరగోళం కొనసాగుతోంది.మొత్తానికి గుంతకల్లు మున్సిపల్ ఎన్నికల్లో కూటమి సీట్ల సర్దుబాటు వ్యవహారం ఉత్కంఠ రేపుతోంది. టీడీపీకి 46, జనసేనకు 7, బీజేపీకి 4 బీ-ఫారాలు జారీ అయినట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో.. జనసేన, బీజేపీ ఆశించిన సీట్లు దక్కించుకుంటాయా? కూటమి ఐక్యంగా బరిలోకి దిగుతుందా? లేక సీట్ల వివాదం కొత్త రాజకీయ పోరుకు దారితీస్తుందా? అన్నది తేలాల్సి ఉంది.

మైక్రో అబ్జర్వర్లు అప్రమత్తంగా వ్యవహరించాలి

కర్నూలు జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి దిశానిర్దేశం





కర్నూలు (తెలుగు కలం) అక్టోబర్ 24 : పట్టణ స్థానిక సంస్థల (ఖూదీ) ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్లు అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలు పక్కాగా అమలయ్యేలా నిశితంగా పరిశీలించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని, బాధ్యతలు మరియు అనుసరించాల్సిన విధులపై సమగ్ర దిశానిర్దేశం చేశారు. పోలింగ్ ప్రక్రియను నిశితంగా పరిశీలించి ప్రతి అంశాన్ని నమోదు చేయడమే మైక్రో అబ్జర్వర్ల ప్రధాన బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. పోలింగ్ ప్రారంభానికి ముందు బ్యాలెట్ బాక్స్ ఖాళీగా ఉందని పోలింగ్ ఏజెంట్లకు చూపించడం, పేపర్ సీల్ వేయడం, అవసరమైన సంతకాలు తీసుకోవడం, మరియు ఓటింగ్ రహస్యాన్ని కాపాడేలా కంపార్ట్‌మెంట్లు సక్రమంగా ఉన్నాయో లేదో గమనించాలని సూచించారు. ప్రిసైడింగ్ అధికారి తన విధులను రూల్స్ ప్రకారం నిర్వహిస్తున్నారా లేదా అనేది గమనిస్తూ, అవసరమైనప్పుడు నిబంధనలకు లోబడి సూచనలు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సీనియర్ సిటిజన్లు, గర్భిణులు, దివ్యాంగులకు ప్రాధాన్యత కల్పించడంతో పాటు ఓటర్లకు చెరగని సిరా గుర్తు వేయడం, రిజిస్టర్లలో సంతకాలు తీసుకోవడం, బ్యాలెట్ పేపర్ల పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఓటరు జాబితాలో పేరు ఉండి ఓటరు స్లిప్ లేని వారికి, ఈసీ ఆమోదించిన చెల్లుబాటు అయ్యే గుర్తింపు పత్రాలలో ఏదైనా ఒకటి సమర్పిస్తే ఓటు వేసేందుకు అనుమతించాలని వివరించారు. అలాగే, అంధులు మరియు ప్రత్యేక పరిస్థితుల్లో ఉన్న ఓటర్ల విషయంలో నిబంధనలను పక్కాగా పాటించేలా చూడాలన్నారు. పోలింగ్ ముగిసే సమయానికి క్యూలో ఉన్న ఓటర్లందరికీ టోకెన్లు జారీ చేసి ఓటు వేసే అవకాశం కల్పించాలని, నిర్దీత సమయం తర్వాత కొత్తగా ఎవరినీ క్యూలోకి అనుమతించకూడదని తెలిపారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ పేపర్ల లెక్కలు, పేపర్ సీల్ ఖాతా, మరియు ప్రిసైడింగ్ అధికారి డైరీ వంటి కీలక రికార్డులను సక్రమంగా తనిఖీ చేయాలన్నారు. ఇవే భవిష్యత్తులో వచ్చే ఫిర్యాదులు, సందేహాలు లేదా న్యాయపరమైన అంశాలకు ప్రధాన ఆధారాలుగా ఉపయోగపడతాయని, అందువల్ల రికార్డుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని హెచ్చరించారు. పోలింగ్ సమయంలో చిన్నచిన్న సమస్యలు ఎదురైతే సంయమనంతో వ్యవహరిస్తూ, వాస్తవాలను నిర్ధారించుకున్న తర్వాత సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. పరిష్కారం కాని క్లిష్టమైన సమస్యలు వస్తే నోడల్ అధికారి, సాధారణ పరిశీలకుడు లేదా జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకెళ్లాలని, నిర్ధారణ లేని సమాచారాన్ని ప్రచారం చేసి గందరగోళం సృష్టించవద్దని పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ద్వారా అన్ని మార్గదర్శకాలపై పూర్తి స్పష్టత తెచ్చుకుని నిష్పక్షపాతంగా తమ బాధ్యతలను నిర్వర్తించాలని కోరారు. ఈ శిక్షణ కార్యక్రమంలో నోడల్ అధికారులు డ్వామా పీడీ నరసింహా రెడ్డి, సీపీవో భారతి, ఎల్డీఎం పి. మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థుల ఎన్నికల ఖర్చులపై పకడ్బందీగా ఆడిట్ నిర్వహించాలి





అనంతపురం (తెలుగు కలం) అక్టోబర్ 24 : జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికల ఖర్చులపై పకడ్బందీగా ఆడిట్ నిర్వహించాలని జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల వ్యయ లెక్కల నోడల్ అధికారి, జిల్లా ఆడిట్ అధికారి వై. ఇందిరా సూచించారు. ఎన్నికల వ్యయ పర్యవేక్షణ బృందాలు సమన్వయంతో పనిచేస్తూ, అభ్యర్థుల ఖర్చుల వివరాలను నిరంతరం పర్యవేక్షించాలని ఆమె స్పష్టం చేశారు. శనివారం జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని డీపీఆర్సీ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల వ్యయ పర్యవేక్షణ బృందం ఆధ్వర్యంలో జిల్లాలోని 31 మండలాలకు చెందిన ఎన్నికల వ్యయ లెక్కల పరిశీలకులు, సంబంధిత అధికారులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్, ఎన్నికల అకౌంటింగ్ అబ్జర్వర్ డీవీఎన్ కృష్ణ, జిల్లా అసిస్టెంట్ ఎక్స్పెండిచర్ అబ్జర్వర్, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం. శైలజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. జడ్పీటీసీ అభ్యర్థులు గరిష్ఠంగా రూ.8 లక్షలు, ఎంపీటీసీ అభ్యర్థులు రూ.4 లక్షల వరకు మాత్రమే ఎన్నికల ప్రచారానికి ఖర్చు చేయాలని పేర్కొన్నారు. నిర్ణీత పరిమితులను మించి ఖర్చు చేసినా, ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభ్యర్థులు అధికారికంగా నమోదు చేయని ఖర్చులపైనా ప్రత్యేక నిఘా ఉంచాలని, అనధికారిక వ్యయాలను గుర్తించేందుకు సూక్ష్మస్థాయి పరిశీలన, నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రతి మండలానికి సంబంధించిన అభ్యర్థుల వివరాలను సమగ్రంగా నమోదు చేసుకోవడంతోపాటు, ఎన్నికల ఖర్చుల లెక్కల నిర్వహణకు అవసరమైన రికార్డులు, ఖాతాలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. అసిస్టెంట్ ఎక్స్పెండిచర్ అబ్జర్వర్లు తమ పరిధిలోని మండలాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చుల వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ప్రతి మూడు రోజులకు ఒకసారి ఖర్చుల వివరాలను తప్పనిసరిగా నమోదు చేసి సమర్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల వ్యయానికి సంబంధించిన ప్రొఫార్మా-1, 2, 3, 4లను ఏ విధంగా సమర్పించాలి, రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన విధంగా ఎన్నికల ఖర్చుల లెక్కలను ఎలా నిర్వహించాలి అనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. అభ్యర్థుల జాబితా ప్రకటించిన తేదీ నుంచి ప్రతి మూడు రోజులకు ఒకసారి అభ్యర్థి లేదా ఆయన ఎన్నికల ఏజెంట్ ఎన్నికల ఖర్చుల వివరాలను రిటర్నింగ్ అధికారికి లేదా ఆయనచే అధికారం పొందిన అధికారికి సమర్పించాలని తెలిపారు. ఈ ప్రక్రియను ప్రత్యక్షంగా, వాస్తవ ఖర్చుల ఆధారంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఎన్నికల వ్యయానికి సంబంధించిన చట్టపరమైన నిబంధనలు, నివేదికల సమర్పణ విధానాలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం, 1994లోని సెక్షన్ 230-బి ప్రకారం, ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తేదీ నుంచి 45 రోజుల్లోగా అభ్యర్థులు తమ తుది ఎన్నికల ఖర్చుల లెక్కలను మండల పరిషత్ అభివృద్ధి అధికారుల ద్వారా జిల్లా ఎన్నికల ప్రాధికారులకు సమర్పించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. నిర్ణీత గడువులో లెక్కలు సమర్పించకపోయినా, ఖర్చుల వివరాల్లో అవకతవకలకు పాల్పడినా లేదా ఎన్నికల సంఘం నిబంధనలను ఉల్లంఘించినా చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ విభాగం ఏ. ఓ. వీరాంజనేయులు, జిల్లా సహకార శాఖకు చెందిన ఉద్యోగులు, జిల్లా ఆడిట్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్థానిక పోరులో 'ఏనుగు' హోరు వైసీపీ, కూటమి పార్టీలకు బీఎస్పీ బిగ్ షాక్!



ధర్మవరం (తెలుగు కలం) అక్టోబర్ 24 : ప్రతినిధి : స్థానిక సంస్థల ఎన్నికల వేళ శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గంలో రాజకీయం తీవ్ర ఉత్కంఠను రేపుతోంది. శనివారం ధర్మవరం పట్టణంలో బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సాకే వినయ్ కుమార్, ముఖ్య నేత మాల్యవంతం రాంప్రసాద్ రాబోయే ఎన్నికల కార్యాచరణను వెల్లడించారు. ప్రధాన రాజకీయ పార్టీలైన వైసీపీ, కూటమి వైఫల్యాలను తండ్రి స్థాయి ప్రజా వేదికలపై ఎండగడుతూ, రాబోయే స్థానిక పోరులో తమ పార్టీ ఏనుగు గుర్తుపై విజయదుందుభి మోగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ, ధర్మవరం మున్సిపల్ చైర్మన్ పదవికి బరిలో నిలిచిన ఎనిమిది మంది అభ్యర్థులలో బీఎస్పీ తరఫున మహిళా నేత కాసెట్టి కళ్యాణిని నిలబెట్టినట్లు ప్రకటించారు. ప్రధాన రాజకీయ పక్షాలు మహిళా ప్రాతినిధ్యానికి మొండిచేయి చూపించిన చోట, బీఎస్పీ మహిళలకు ప్రాధాన్యం ఇచ్చిందని గుర్తుచేశారు. అలాగే 22వ వార్డు అభ్యర్థిగా పోటీ చేస్తున్న రేవతిని విజయం దిశగా ఆశీర్వదించాలని కోరారు. బత్తలపల్లి మండలంలో బీఎస్పీ బోణీ కొడుతూ అటు వైసీపీ, ఇటు కూటమి నాయకులకు షాక్ ఇస్తోందని రాంప్రసాద్ తెలిపారు. బత్తలపల్లిలో ఐదు చోట్ల బీఎస్పీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, రెండు స్థానాల్లో వైసీపీ తరఫున పోటీలో అభ్యర్థులు లేకపోవడంతో అక్కడ బీఎస్పీ విజయం దాదాపు ఖాయమైందని ధీమా వ్యక్తం చేశారు. వినయ్ కుమార్ నాయకత్వంలో పార్టీ సంచలన విజయాలు సాధించి ఎంపీటీసీ స్థానాలతో ఖాతా తెరవడం ఖాయమని అన్నారు. దీనితో పాటు ధర్మవరం రూరల్ చిగిచెర్ల ఎంపీటీసీ అభ్యర్థిగా, తాడిమర్రి జడ్పీటీసీ అభ్యర్థిగా సాకే కుళ్లాయప్ప, జడ్పీటీసీ అభ్యర్థులుగా ఈశ్వరమ్మ, ముదిగుబ్బ జడ్పీటీసీ అభ్యర్థిగా ఆంజనేయులు బరిలో ఉన్నట్లు వివరించారు. అయితే, ఎన్నికల వేళ తమ అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని మండిపడిన నేతలు, ప్రశాంతమైన వాతావరణంలో స్వేచ్ఛగా, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, ఇళ్ల నిర్మాణ సమస్యలతో పాటు అర్హులైన పేదలందరికీ వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పింఛన్లు ఇవ్వడంలో విఫలమైందని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఆర్ఎస్పీ నాయకుడు మంజుల నరేంద్ర బీఎస్పీకి తమ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. మహిళా సాధికారత, ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల పారదర్శక అమలే ధ్యేయంగా బరిలోకి దిగుతున్న తమ అభ్యర్థులను ఏనుగు గుర్తుపై ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని బీఎస్పీ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బీఎస్పీ రూరల్ అధ్యక్షుడు సాకే ఆదినారాయణ, నాయకులు మల్లికార్జున, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

ఆదివారం 25 - 10 - 2026

నోడల్ అధికారులు బాధ్యతగా ఎన్నికల విధులను నిర్వర్తించాలి అబ్జర్వర్ బి.స్మరణ్ రాజ్



అనంతపురం (తెలుగు కలం) అక్టోబర్ 24 :స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నోడల్ అధికారులు అత్యంత బాధ్యతాయుతంగా ఎన్నికల విధులను నిర్వర్తించాలని, స్థానిక సంస్థల జనరల్ అబ్జర్వర్ బి. స్మరణ్ రాజ్ సూచించారు. శనివారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ. ఆనంద్ అధ్యక్షతన నోడల్ అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎక్స్అండిచర్ అబ్జర్వర్ సుబ్బరాజు, జిల్లా ఎస్పీ పి. జగదీష్, అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్ తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ?ఈ సందర్భంగా జనరల్ అబ్జర్వర్ బి. స్మరణ్ రాజ్ మాట్లాడుతూ, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులందరూ అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల మెటీరియల్ పంపిణీ, రిసెప్షన్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటును వేగవంతం చేయాలన్నారు. క్షేత్రస్థాయిలోని సమస్యలను ఎప్పటికప్పుడు ఫాలోఅప్ చేస్తూ సరైన సమయానికి నివేదికలు అందించాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ స్పష్టం చేశారు. జడ్పిటిసి, ఎంపిటిసి మరియు మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించి మ్యాన్ పవర్ మేనేజ్మెంట్, ర్యాండమైజేషన్ ప్రక్రియలు, బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్, ఫెసిలిటేషన్ సెంటర్ల ఏర్పాటు, శిక్షణ తరగతులను పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ?పోలింగ్ కేంద్రాలలో లైటింగ్, ఫ్యాన్లు, విద్యుత్ సరఫరా, దివ్యాంగులకు వీల్ చైర్స్ వంటి మౌలిక వసతులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కాగా, శాంతిభద్రతల పరంగా కొన్ని చెదురుమదురు సంఘటనలు మినహా జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా సాగుతోందని జిల్లా ఎస్పీ పి. జగదీష్ తెలిపారు. ఎన్నికల వ్యయానికి సంబంధించిన నివేదికలను మరియు రిజిస్టర్లను నిరంతరం పర్యవేక్షించాలని ఎక్స్అండిచర్ అబ్జర్వర్ సుబ్బరాజు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఓ) ఏ. మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, పలువురు నోడల్ అధికారులు, ఎన్ఐసి అధికారులు పాల్గొన్నారు.

జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లను

పటిష్టంగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశం



అనంతపురం (తెలుగు కలం) అక్టోబర్ 24 : జడ్పిటిసి మరియు ఎంపిటిసి ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యేలా సమగ్ర ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ. ఆనంద్ అధికారులను ఆదేశించారు. శనివారం ఉరవకొండ పట్టణంలోని ఎస్.కె. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలు మరియు స్ట్రాంగ్ రూమ్లను జిల్లా ఎస్పీ పి. జగదీష్, అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్లతో కలిసి ఆయన ప్రత్యక్షంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు, కూడేరు మండలాలకు సంబంధించిన కౌంటింగ్ కేంద్రాల భద్రత, పరిశీలన స్థలాలు, స్ట్రాంగ్ రూమ్ల రక్షణ చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. తనిఖీ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కౌంటింగ్ కేంద్రాల్లో ఏ విధమైన అసౌకర్యం కలగకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి కౌంటింగ్ కేంద్రంలో కనీసం నాలుగు టేబుళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రిసెప్షన్ కౌంటర్లు, కౌంటింగ్ హాల్స్ మరియు స్ట్రాంగ్ రూమ్స్ వద్ద కట్టుదిట్టమైన పోలీస్ భద్రత కల్పించాలని, అవసరమైన ప్రదేశాల్లో బ్యారికేడింగ్ ఏర్పాటు చేసి భద్రతాపరమైన సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియను సజావుగా ముగించేందుకు నిర్దేశిత గడువులోగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో డీఎస్పీ బి. శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి మరియు ఎన్నికల అధికారి సాలూరెడ్డి, తహసీల్దార్ అరుణ, ఎంపిడిఓ రవిప్రసాద్, సిఐ మహానందితో పాటు పలువురు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధితో ప్రజల మనసులు గెలుచుకుంటున్నాం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

రాయదుర్గంలో టీడీపీలోకి భారీ చేరికలు

120 దళిత కుటుంబాలకు సాధర స్వాగతం

పసుపు జెండా నీడలోకి దళిత సమూహం..

ఆహ్వానించిన ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు





(తెలుగు కలం) అక్టోబర్ 24 : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల మనసులను గెలుచుకుంటున్నాయని ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. రాయదుర్గం పట్టణంలోని 24వ వార్డు అంబేద్కర్ నగర్కు చెందిన సుమారు 120 దళిత కుటుంబాలు శనివారం తెలుగుదేశం పార్టీలో చేరాయి. యువ నాయకుడు రామాంజనేయుల ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సాదరంగా స్వాగతం పలికి, పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. సామాజిక పింఛన్లను రూ.3,000 నుంచి రూ.4,000కు పెంచడంతో పాటు, దివ్యాంగులు, వితంతువులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి పింఛన్ల రూపంలో ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. ఈ పింఛన్లు ఎన్నో పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నాయన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా అర్హులైన ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15,000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతోపాటు, అర్హులైన పేద కుటుంబాలకు ఏడాదికి మూడు ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల పేద కుటుంబాలకు ఏదో ఒక రూపంలో సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలోనే ఇన్ని సంక్షేమ కార్యక్రమాలు సమర్థంగా అమలవుతున్నాయని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధికి కూడా ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గత రెండేళ్లలో రాయదుర్గం పట్టణంలో సుమారు రూ.260 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. రామాంజనేయులు ఆధ్వర్యంలో 120 దళిత కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరడం గర్వకారణమన్నారు. పార్టీలో చేరిన వారిలో వంద మందికి పైగా యువకులు ఉండటం ఈ ప్రాంతంలో టీడీపీకి మరింత బలం చేకూర్చుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై విశ్వాసంతోనే వారంతా పార్టీలో చేరారని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీని రాబోయే మూడు దశాబ్దాల పాటు యువ నాయకుడు నారా లోకేష్ మరింత బలోపేతం చేస్తారన్నారు. ఆయన నాయకత్వంలో పార్టీ మరింత బలంతో ముందుకు సాగుతుందనే నమ్మకంతో యువత టీడీపీ పట్ల ఆకర్షితులవుతోందని తెలిపారు. పార్టీలోకి కొత్త తరం యువత రావాలని, యువ రక్తంతో పార్టీ మరింత ఉత్సాహంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, చైర్మన్ అభ్యర్థి టశీకశాల హనుమంతు, అభ్యర్థి హరిజన నాగమ్మ, హరిజన నాగరాజు, పైతోట రామంజినేయులు,హరిజన ఆనంద్,మల్లికార్జున,బంగి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వర్షంలో తడిసిన రేషన్ సరుకులు.. రక్షణ చర్యలు ఏవీ?

లారీలోనే తడిసిన బియ్యం, జొన్నలు, చక్కెర.. నాణ్యతపై సందేహాలు

మున్సిపాలిటీ ఎదుట ఘటన.. సరుకుల భద్రతపై అధికారుల పర్యవేక్షణ ఏదీ?





గుంతకల్లు (తెలుగు కలం) అక్టోబర్ 24 :పేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్ సరుకుల రవాణాలో తగిన జాగ్రత్తలు తీసుకున్నారా అన్న ప్రశ్నలు గుంతకల్లులో తలెత్తాయి. పట్టణ మున్సిపాలిటీ కార్యాలయానికి ఎదురుగా ఉన్న రేషన్ దుకాణం వద్దకు సరుకులతో వచ్చిన లారీలో బియ్యం, జొన్నలు, చక్కెర వర్షానికి తడవడం చర్చనీయాంశంగా మారింది. వర్షం కురుస్తున్న సమయంలో సరుకులను కాపాడేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయకపోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.రేషన్ దుకాణం నంబర్ 1285046, డీలర్ పి. శ్రీదేవి దుకాణానికి సరుకులతో కూడిన లారీ చేరుకుంది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల మధ్య వర్షం కురుస్తున్నప్పటికీ సరుకులపై తార్పాలిన్ కప్పి రక్షించలేదని అక్కడి పరిస్థితులు సూచించాయి. వర్షం నుంచి తప్పించుకునేందుకు హమాలీలు దుకాణంలోకి వెళ్లగా, లారీలోని సరుకులు తడిసిపోయాయి.

తార్పాలిన్ ఉన్నా ఉపయోగించలేదా? :-

విషయాన్ని గమనించిన విలేకరులు డీలర్, లారీ డ్రైవర్ను ప్రశ్నించగా, వర్షం వస్తుందని ఊహించలేదని, తార్పాలిన్ గోదాములో ఉందని వారు చెప్పినట్లు తెలిసింది. అయితే లారీపై తార్పాలిన్ ఉన్నప్పటికీ సరుకులను ఎందుకు కప్పలేదని ప్రశ్నించగా, అది అప్పటికే తడిసిపోయిందని సమాధానం ఇచ్చినట్లు విలేకరులు తెలిపారు. ఈ క్రమంలో లారీపై ఉన్న తార్పాలిన్ను హమాలీలు కిందకు దించడం కూడా గమనించారు.



తడిసిన సరుకులపై తనిఖీలు చేపట్టాలి :-

వర్షానికి తడిసిన సరుకులను కార్డుదారులకు పంపిణీ చేస్తారా అని ప్రశ్నించగా, వాటిని లారీలోనే ఉంచి తిరిగి గోదాముకు పంపిస్తామని డీలర్, డ్రైవర్ తెలిపినట్లు సమాచారం. అయితే సరుకులు తిరిగి గోదాముకు చేరాయా? వాటి నాణ్యతను అధికారులు పరిశీలిస్తారా? రవాణా సమయంలో జరిగిన నష్టానికి బాధ్యత ఎవరిది? అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి.రేషన్ సరుకులు వర్షం, తేమకు గురికాకుండా రవాణా సమయంలో తగిన రక్షణ చర్యలు తీసుకోవడం అవసరం. ఈ ఘటనపై సంబంధిత అధికారులు పరిశీలన జరిపి, తడిసిన సరుకుల నాణ్యతను తనిఖీ చేయాలని, వినియోగానికి అనర్హమైన సరుకులు ప్రజలకు పంపిణీ కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వైసీపీ అభ్యర్థి ఫయాజ్ బాషా సంచలన వ్యాఖ్యలు

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పచ్చ పార్టీ వైఖరిపై విమర్శలు



తాడిపత్రి (తెలుగు కలం) అక్టోబర్ 24 : ప్రతినిధి : పట్టణ అభివృద్ధిపై నమ్మకం ఉంటే మున్సిపల్ ఎన్నికల ప్రజా తీర్పుకు భయపడాల్సిన అవసరం ఏముందని వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి ఫయాజ్ బాషా ప్రశ్నించారు. స్థానిక ఫయాజ్ బాషా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమి పాలన మరియు స్థానిక అధికార పార్టీ నాయకత్వం తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.అధికారులు మరియు పచ్చ పార్టీ నేతలు కలిసి ఉద్దేశపూర్వకంగానే దాదాపు 25 నామినేషన్లను తిరస్కరించారని ఆయన ఆరోపించారు. స్క్రూటినీ ప్రక్రియలో భారీగా అక్రమాలు జరిగాయని, దీనిపై స్పష్టమైన ఆధారాలతో రాష్ట్ర ఎన్నికల కమిషన్కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఫిర్యాదు ప్రతిని విలేకరులకు ప్రదర్శించారు. జిల్లా ఎన్నికల అధికారి వెంటనే స్పందించి స్క్రూటినీ జరిగిన సమయానికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని సమగ్రంగా పరిశీలించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని మండిపడుతూ, ఆయన కేవలం పచ్చ చొక్కా వేసుకోవడమే తక్కువ అని ఘాటుగా వ్యాఖ్యానించారు. డబ్బు, బెదిరింపులకు లోబడే ప్రసక్తే లేదని స్పష్టం చేసిన ఫయాజ్ బాషా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్ణయం మేరకే పోటీ బరిలో నిలిచానని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రకటించిన “సూపర్ సిక్స్” హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించకపోగా, వాగ్దానం చేసిన నిరుద్యోగ భృతిని కూడా అందించలేదని విమర్శించారు. నామినేషన్ దాఖలు చేసిన తమ పార్టీ అభ్యర్థులపై అధికార పార్టీ నేతలు దాడులకు తెగబడుతున్నా పోలీసులు సైలెంట్గా ఉంటూ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. స్థానిక నాయకత్వ తీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, భయం లేకుండా ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగా సజావుగా నిర్వహించాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల తుది న్యాయ నిర్ణేతలు ప్రజలేనని, వచ్చే తీర్పుతో అధికార పార్టీకి తగిన బుద్ధి చెబుతారని, ఈసారి తాడిపత్రి ప్రజలు మార్పును కోరుకుంటూ వైఎస్సార్సీపీకి పట్టం కట్టడం ఖాయమని ఫయాజ్ బాషా ధీమా వ్యక్తం చేశారు.

శ్రీసత్యసాయి జిల్లాలో వేడెక్కిన రాజకీయాలు..

జడ్పీ పీఠంపై పరిటాల శ్రీరామ్ వ్యూహాత్మక అడుగులు

రామగిరి (తెలుగు కలం) అక్టోబర్ 24 : ప్రతినిధి : శ్రీసత్యసాయి జిల్లాలో స్థానిక సంస్థల రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. జిల్లాలోని స్థానిక సంస్థల ఎన్నికలపై ధర్మవరం తెలుగుదేశం పార్టీ ఇన్ఛార్జి పరిటాల శ్రీరామ్ అత్యంత వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా సల్లచెరువు జెడ్పీటీసీ (ZPTC) అభ్యర్థిగా ఆయన నామినేషన్ దాఖలు చేయడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఎలానైనా జిల్లా పరిషత్ (జెడ్పీ) పీఠాన్ని కైవసం చేసుకోవాలనే బలమైన సంకల్పంతో ఉన్న ఆయన, ఆ దిశగా తన ప్రయత్నాలను ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తూ, జిల్లా వ్యాప్తంగా విస్తృత పర్యటనలకు శ్రీకారం చుట్టారు. ఈ వ్యూహాత్మక ప్రయాణంలో భాగంగా పరిటాల శ్రీరామ్ తొలుత రామగిరి మండలం వెంకటాపురానికి చేరుకున్నారు. అక్కడ గ్రామ దేవత శ్రీ ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికల వేళ పార్టీ విజయం సాధించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించే అవకాశం కలగాలని ఆయన అమ్మవారిని వేడుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆయన రామగిరిలోని పరిటాల ఘాట్ వద్దకు చేరుకున్నారు. అక్కడ తన తండ్రి, దివంగత నేత పరిటాల రవీంద్ర విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. తండ్రి సమాధి వద్ద నివాళులర్పించిన అనంతరం ఆయన ఆశీస్సులు తీసుకున్న శ్రీరామ్, ప్రజల సంక్షేమం కోసం, పార్టీ బలోపేతం కోసం తన రాజకీయ ప్రయాణాన్ని మరింత ఉత్సాహంగా ముందుకు తీసుకెళ్లనున్నట్లు సంకేతాలు ఇచ్చారు. పరిటాల శ్రీరామ్ నాయకత్వంలో ధర్మవరం నియోజకవర్గంలో ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ పరిణామాలన్నీ చూస్తుంటే, రాబోయే రోజుల్లో జిల్లా రాజకీయాలు మరింత రసవత్తరంగా మారనున్నాయని స్పష్టమవుతోంది. ధర్మవరం నియోజకవర్గంలో పరిటాల కుటుంబానికి బలమైన పట్టు ఉన్న నేపథ్యంలో, జడ్పీ పీఠం కోసం జరిగే పోరు ఆసక్తికరంగా మారనుంది. పరిటాల శ్రీరామ్ ఈ పోరులో నిలవడం, జెడ్పీ పీఠాన్ని లక్ష్యంగా చేసుకుని పావులు కదుపుతుండటంతో ఉమ్మడి అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా రాజకీయాల్లో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది.

జడ్పీ కార్యాలయంలో నామినేషన్ల పరిశీలన ప్రక్రియ ప్రారంభం



కొత్తచెరువు (తెలుగు కలం) అక్టోబర్ 24 : ప్రతినిధి : శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ వేగవంతమైంది. జిల్లాలో జెడ్పీటీసీ (ZPTC), ఎంపీటీసీ (MPTC) ఎన్నికలకు సంబంధించి దాఖలైన నామినేషన్ల పరిశీలన ప్రక్రియ శనివారం నాటితో అధికారికంగా ప్రారంభమైంది. కొత్తచెరువులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి మౌర్య భరద్వాజ్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. వివిధ స్థానాలకు పోటీ చేస్తున్న అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అభ్యర్థులు సమర్పించిన ధ్రువీకరణ పత్రాలు, అవసరమైన ఆధారాలు మరియు వ్యక్తిగత ?లను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం అర్హత కలిగిన వారి నామినేషన్లను స్వీకరించే ప్రక్రియను అధికారులు పారదర్శకంగా చేపట్టారు. నామినేషన్ల పరిశీలన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా యంత్రాంగం మరియు పోలీసు విభాగం తగిన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఎన్నికల నియమావళి ప్రకారం ఈ పరిశీలన ప్రక్రియ పక్కాగా జరుగుతుందని, అర్హత పొందిన అభ్యర్థుల పూర్తి వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తామని రిటర్నింగ్ అధికారి తెలిపారు.

పారదర్శకంగా నామినేషన్ల

పరిశీలన పూర్తి చేయాలి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్

బుక్కపట్నం (తెలుగు కలం) అక్టోబర్ 24 :ప్రతినిధి : స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా జరుగుతున్న నామినేషన్ల పరిశీలనను అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా పూర్తి చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం బుక్కపట్నం ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతున్న ఎంపీటీసీ నామినేషన్ల పరిశీలన ప్రక్రియను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నామినేషన్ల స్వీకరణ కేంద్రం, పరిశీలన రికార్డులు, అభ్యర్థులు దాఖలు చేసిన పత్రాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. అనంతరం కేంద్రంలో విధుల్లో ఉన్న రిటర్నింగ్ అధికారులు, ఇతర సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ప్రతీ నామినేషన్ పత్రాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి న్యాయబద్ధంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. అలాగే నామినేషన్ల పరిశీలన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు యంత్రాంగాన్ని సూచించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించేందుకు అధికారులు, పోలీసు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో సంబంధిత స్థానిక అధికారులు, పరిశీలన సిబ్బంది, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

నెంగినేని వెంకటలక్ష్మిని గెలిపించండి.. అభివృద్ధికి పట్టం కట్టండి

అభివృద్ధి, సంక్షేమం వైఎస్సార్సీపీతోనే సాధ్యమని వై. నైరుతి రెడ్డి వ్యాఖ్య



గుంతకల్లు, (తెలుగు కలం) అక్టోబర్ 24 : గుంతకల్లు మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్సీపీ జోరు పెంచింది. 27, 28వ వార్డుల్లో చైర్పర్సన్ అభ్యర్థి నెంగినేని వెంకటలక్ష్మి, 27వ వార్డు అభ్యర్థి గులాం రిజ్వానా, 28వ వార్డు అభ్యర్థి షేక్ జమీల్తో కలిసి పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు వై. నైరుతి రెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రజలను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.ఈ సందర్భంగా వై. నైరుతి రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి,సంక్షేమం వైఎస్సార్సీపీతోనే సాధ్యమని అన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి చైర్పర్సన్ అభ్యర్థి నెంగినేని వెంకటలక్ష్మిని గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి,మాజీ ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి తనపై నమ్మకంతో చైర్పర్సన్ అభ్యర్థిగా అవకాశం కల్పించారని నెంగినేని వెంకటలక్ష్మి తెలిపారు. వైయస్సార్ పార్టీ అప్పగించిన బాధ్యతను ప్రజల విశ్వాసంతో నెరవేర్చేందుకు కృషి చేస్తానన్నారు.వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని హామీ ఇచ్చారు.టీడీపీ పాలనలో ప్రజలకు జరిగిన అన్యాయాలను వివరిస్తూ,ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీటీసీ నామినేషన్ల పునఃపరిశీలన

నామినేషన్ కేంద్రం వద్ద పోలీసుల పటిష్ట బందోబస్తు



పెద్దవడుగూరు (తెలుగు కలం) అక్టోబర్ 24 : ప్రతినిధి : స్థానిక ఎంపీటీసీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా పెద్దవడుగూరు మండలంలో నామినేషన్ పత్రాల పునఃపరిశీలన (స్క్రూటినీ) కార్యక్రమాన్ని అధికారుల సమక్షంలో చేపట్టారు. ఈ సందర్భంగా నామినేషన్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు నిర్వహించారు. డి.ఎస్.పి చంద్రశేఖర మరియు ఎస్సై రాఘవేంద్రప్పల ప్రత్యక్ష పర్యవేక్షణలో భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. స్థానిక ఎన్నికల ప్రక్రియ అత్యంత ప్రశాంత వాతావరణంలో, పూర్తి పారదర్శకంగా మరియు సజావుగా సాగేలా పోలీసు యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. నామినేషన్ కేంద్రం పరిసర ప్రాంతాలలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు భద్రతా జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. కేంద్రం వద్ద పరిస్థితులను అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా నామినేషన్ల పునఃపరిశీలన ప్రక్రియ సునాయాసంగా పూర్తయ్యేలా చూస్తున్నారు.

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
ఆదివారం 25 - 10 - 2026

పెరుగుతున్న వాయు కాలుష్యం హైదరాబాద్ సంగారెడ్డిలో జాతీయ పరిమితి కంటే 33.3 శాతం ఎక్కువ

తెలంగాణలో హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాలో వాయు కాలుష్యం పెరిగిపోతోంది.

వాతావరణంలో కలుస్తున్న దుమ్ము, ధూళి వల్ల పీఎం 10 స్థాయి జాతీయ ప్రమాణాల కంటే ఎక్కువగా నమోదవుతున్నాయి.



వాయుకాలుష్యం దిల్లీలోనే కాదు మన రాష్ట్రంలోనూ డేంజర్ బెల్స్ మోగిస్తోంది. జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం పరిధిలో ఉన్న హైదరాబాద్, నల్గొండ నగరాలతో పాటు జిల్లా కేంద్రం సంగారెడ్డిలోనూ గాలి నాణ్యత ఆందోళనకరంగా ఉంది. ఈ ప్రాంతాల్లో పారిశ్రామిక కాలుష్యం, వాహనాల నుంచి వెలువడే ఉద్గారాలు, రోడ్లపై ఉండే ధూళి, నిర్మాణ పనులు గాలి నాణ్యతను దెబ్బతీస్తున్నాయి.

ఈ 3 ప్రదేశాల్లోనే ఎక్కువ

2025--26 సంవత్సరానికి సంబంధించిన వార్షిక సగటు గణాంకాల ప్రకారం, పీఎం-10 స్థాయి జాతీయ ప్రమాణాలను మించి ఉన్నాయి. హైదరాబాద్‌లో కాలుష్య స్థాయిలు జాతీయ పరిమితి కంటే 33.3% ఎక్కువగా ఉండగా, సంగారెడ్డి, నల్గొండలలో వరుసగా 30%,18.3% అధికంగా ఉన్నాయి.

గాలిలో పీఎం-10 స్థాయిలు ఎంత ఉండాలి

పీఎం-10 అనేది సూక్ష్మ కణ పదార్థాల సమూహాన్ని సూచిస్తుంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) నిర్దేశించిన గాలి నాణ్యత ప్రమాణాల ప్రకారం, పీఎం - 10 వార్షిక సగటు గాఢత గాలిలో క్యూబిక్ మీటరుకు 60 మైక్రోగ్రాములకు మించకూడదు. అయితే 2025-26లో హైదరాబాద్‌లో 80 మైక్రోగ్రాములు, సంగారెడ్డిలో 78 మైక్రోగ్రాములు, నల్గొండలో 71 మైక్రోగ్రాములుగా నమోదయ్యాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల ప్రకారం, పీఎం-10 వార్షిక సగటు 15 మైక్రోగ్రాములుగా ఉండాలి. ఈ ప్రమాణంతో పోలిస్తే, నమోదైన స్థాయిలు హైదరాబాద్‌లో 5.3 రెట్లు, సంగారెడ్డిలో 5.2 రెట్లు, నల్గొండలో 4.7 రెట్లు ఎక్కువగా ఉన్నాయి.

వాయు కాలుష్యంతో దీర్ఘకాల సమస్యలు

సూక్ష్మ ధూళికణాల సమూహం శ్వాస ద్వారా శరీరంలోకి ప్రవేశించి ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతాయి. వాయు కాలుష్యానికి దీర్ఘకాలం పాటు గురికావడం వల్ల శ్వాసకోశ, హృదయ సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదం పెరుగుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, ఇప్పటికే ఆస్తమా, గుండె జబ్బులు లేదా ఊపిరితిత్తుల సంబంధిత అనారోగ్య సమస్యలు ఉన్నవారిపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. వాయు కాలుష్యాన్ని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 2019లో 'నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్'ను ప్రారంభించింది. అప్పటితో పోలిస్తే హైదరాబాద్‌లో కొంత మెరుగుదల కనిపించినప్పటికీ, కాలుష్య స్థాయిలు ఇప్పటికీ నిర్దేశిత పరిమితుల కంటే 33.3 శాతం ఎక్కువగా ఉన్నాయి.

రాష్ట్రంలో 18 జిల్లాల్లో కనిష్ఠ వర్షపాతం 358 మండలాల్లో కరవు!

ఎల్‌నినో పరిస్థితులపై క్యాబినెట్ సబ్‌కమిటీ చర్చించింది. నెలాఖరులో కరవు మండలాల జాబితాను వెల్లడించనుంది. రాష్ట్రంలో 358 మండలాల్లో కరవు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించింది. పరిస్థితులను పర్యవేక్షించాలని కలెక్టర్లను ఆదేశించింది. రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితులను అధిగమించేందుకు అన్ని శాఖలు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని కేబినెట్ సబ్ కమిటీ ఆదేశించింది. కరవు మండలాలను గుర్తించి, ఈ నెలాఖరులోగా కేంద్రానికి పంపించాలని సూచించింది. కలెక్టర్లు అప్రమత్తంగా ఉండి, నిరంతరం పరిస్థితులను పర్యవేక్షించాలని స్పష్టం చేసింది. రాష్ట్రంలో 358 మండలాల్లో కరవు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు సీఎస్ సంజయ్ జాజు తెలిపారు.

శాఖల వారీగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు

ఎల్‌నినో వల్ల ఎదురయ్యే కరవును ఎదుర్కొనేందుకు శాఖల వారీగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని మంత్రివర్గ ఉపసంఘం ఉన్నతాధికారులను ఆదేశించింది. సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ తొలి సమావేశం జరిగింది. ఎల్‌నినో, కరవు ప్రభావం, నీటి లభ్యత, రైతులకు అందించాల్సిన ఉపశమన చర్యలు, భవిష్యత్ కార్యాచరణపై సమావేశంలో చర్చించారు. ఎల్‌నినోతో ఉత్పన్నమయ్యే పరిస్థితులపై చర్చించడానికి త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది.ఈ నెల 31లోగా కరవు మండలాలను ప్రకటించాలని సూచించింది. కరవు ప్రభావిత మండలాలను శాస్త్రీయంగా, నిబంధనల ప్రకారం గుర్తించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ఏయే రంగాలపై ఎలా ఉండబోతోందో ముందుగానే అంచనా వేస్తే అవసరమైన సాయం సకాలంలో అందించేందుకు వీలవుతుందని కేబినెట్ సబ్ కమిటీ అభిప్రాయపడింది.

యాసంగిలో ప్రత్యామ్నాయ పంటలు

కలెక్టర్లు ప్రతి వారం సమీక్ష నిర్వహించి కరవు నివారణ చర్యలు చేపట్టాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. నీటి ఎద్దడి నేపథ్యంలో వరి వేయవద్దన్నారు. యాసంగిలో ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. రైతులకు వాస్తవ పరిస్థితులను వివరించి, చైతన్య పరచాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సూచించారు. ఎల్‌నినో తీవ్రత, భూగర్భ జలాల మట్టాలపై గణాంకాలను ప్రతి వారం జిల్లాల్లో విడుదల చేయాలన్నారు.

చేపల మనుగడ కష్టమే

కలెక్టర్లు, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్లకు అత్యవసర ప్రత్యేక నిధులు కేటాయించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. రాష్ట్రంలో దాదాపు రూ.7 వేల కోట్లతో కరవు పనులు చేపడుతున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉండేలా కార్యాచరణను చేయాలని అధికారులను సీతక్క కోరారు. చెరువుల్లో నీరు గణనీయంగా తగ్గిపోతున్నందున చేపల మనుగడకు కష్టంగా మారిందని పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. పెద్ద రిజర్వాయర్లలో చేపలను వదిలేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు.



నెలాఖరులోగా కరవు మండలాల జాబితా

ప్రతి జిల్లా కలెక్టర్‌కు అత్యవసర నిధుల కింద రూ.కోటి ఇప్పటికే విడుదల చేసినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. రాష్ట్రంలో 358 మండలాల్లో కరవు పరిస్థితులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు సీఎస్ చెప్పారు. ఈ నెల 31 తేదీలోగా కేంద్ర ప్రభుత్వానికి కరవు మండలాల జాబితాను సమర్పిస్తామన్నారు. రాష్ట్రంలో 18 జిల్లాల్లో కనిష్ఠ వర్షపాతం నమోదు కాగా, 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదయిందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 324 మండలాల్లో భూగర్భ జలాలు ఆందోళనకర స్థాయిలో ఉన్నాయని సీఎస్ వివరించారు. రిజర్వాయర్లలో 470 టీఎంసీలకు గానూ 170 టీఎంసీలు మాత్రమే ఉన్నాయన్నారు. సింగూరు జలాశయంలో నీటి కొరత పరిస్థితులను అధిగమించడానికి ప్రత్యామ్నాయ ప్రణాళికలను రూపొందించామని స్పష్టం చేశారు.

మహిళలపై నేరాల కేసులు.. దేశంలోనే ఏపీకి రెండో స్థానం!

దేశవ్యాప్తంగా 187 మంది ప్రజాప్రతినిధులపై కేసులు

జాబితాలో బీజేపీ టాప్, టీడీపీకి మూడో స్థానం

14 మందిపై అత్యాచారం కేసులు.. ఐదుగురు కేంద్ర మంత్రులపై ఆరోపణలు

నేరచరిత ఉన్నవారిని అనర్హులుగా ప్రకటించాలన్న ఏడీఆర్



చట్టసభల్లో మహిళల హక్కులు, రక్షణ గురించి మాట్లాడాల్సిన ప్రజాప్రతినిధులే మహిళలపై అఘాయిత్యాలు, వేధింపుల కేసుల్లో నిందితులుగా ఉన్నారన్న చేదు నిజాన్ని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్ (ఏడీఆర్) నివేదిక బట్టబయలు చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రజాప్రతినిధులపై నమోదైన క్రిమినల్ కేసులను విశ్లేషించి శుక్రవారం విడుదల చేసిన ఈ నివేదికలో సంచలన విషయాలు వెలుగుచూశాయి. ముఖ్యంగా, మహిళలపై నేరాలకు సంబంధించిన కేసుల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రెండో స్థానంలో నిలవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.ఏడీఆర్ నివేదిక ప్రకారం, దేశవ్యాప్తంగా ఉన్న 4,881 మంది సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేల ఎన్నికల అఫిడవిట్లను విశ్లేషించగా, మొత్తం 187 మంది ప్రజాప్రతినిధులపై మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులు నమోదయ్యాయి. వీరిలో 19 మంది ఎంపీలు, 168 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరందరిలో 14 మందిపై (12 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు) నేరుగా అత్యాచారం (ఐపీసీ సెక్షన్ 376) కేసులు ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

తెలుగు రాష్ట్రాల్లో కలవరపరిచే గణాంకాలు

మహిళలపై నేరాల కేసులున్న ప్రజాప్రతినిధుల జాబితాలో ఆంధ్రప్రదేశ్ 22 మందితో (21 మంది ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ) దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. కూటమి ప్రభుత్వంలోని నలుగురు మంత్రులపై కూడా ఇలాంటి కేసులు ఉన్నట్లు నివేదిక పేర్కొంది. ఒక వివాదస్పద ఎమ్మెల్యేపై అత్యాచారం కేసు ఉందని, ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన ఒక యువ ఎంపీతో పాటు రాజ్యాంగ పదవిలో ఉన్న సీనియర్ నేతపై కూడా అభియోగాలున్నట్లు తెలిపింది.తెలంగాణలో మొత్తం ఐదుగురు ప్రజాప్రతినిధులపై (ముగ్గురు లోక్‌సభ ఎంపీలు, ఇద్దరు ఎమ్మెల్యేలు) కేసులున్నాయి. వీరిలో ముగ్గురు బీజేపీ ఎంపీలు కాగా, తొలిసారి గెలిచిన ఒక సిట్టింగ్ ఎంపీపై అత్యాచారం కేసు నమోదై ఉండటం గమనార్హం.

పార్టీలు, రాష్ట్రాల వారీగా వివరాలు

పార్టీల వారీగా చూస్తే, బీజేపీకి చెందిన 106 మంది (95 మంది ఎమ్మెల్యేలు, 11 మంది ఎంపీలు) ఈ జాబితాలో ఉండి మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ నుంచి 20 మంది, తెలుగుదేశం పార్టీ (టీడీపీ) నుంచి 18 మంది (17 మంది ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ) ప్రజాప్రతినిధులు మూడో స్థానంలో ఉన్నారు. బీజేపీకి చెందిన 11 మంది ఎంపీలలో ఐదుగురు కేంద్ర మంత్రులు కాగా, వారిలో ఒకరు తెలుగు రాష్ట్రాలకు చెందినవారని నివేదిక స్పష్టం చేసింది. రాష్ట్రాల పరంగా పశ్చిమ బెంగాల్ (69) మొదటి స్థానంలో ఉండగా, ఆంధ్రప్రదేశ్ (22) రెండో స్థానంలో, ఒడిశా (17) మూడో స్థానంలో నిలిచాయి.మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి రాజకీయ పార్టీలు టికెట్లు ఇవ్వడాన్ని ఏడీఆర్ తీవ్రంగా తప్పుబట్టింది. ఇలాంటి నేర చరిత్ర ఉన్నవారిని ఎన్నికల్లో పోటీ చేయకుండా శాశ్వతంగా అనర్హులుగా ప్రకటించాలని, వారి కేసులను ఫాస్ట్-ట్రాక్ కోర్టుల ద్వారా వేగంగా విచారించి శిక్షలు ఖరారు చేయాలని ఏడీఆర్ డిమాండ్ చేసింది.

చైనా గస్తీ తీరుతో సరిహద్దుల్లో అలజడి.. కేంద్రం కీలక ప్రకటన

చైనా గస్తీ విధానాల మార్పులతో సరిహద్దుల్లో పరిస్థితులు మారుతున్నాయని కేంద్రం వెల్లడి

అరుణాచల్‌లో చైనా సైనికులతో ముఖాముఖి పరిస్థితులు కొనసాగుతున్నాయని ఐటీబీపీ చీఫ్ ప్రకటన

సమస్యల పరిష్కారానికి భారత్, చైనా మధ్య చర్చలు కొనసాగుతున్నాయని విదేశాంగ శాఖ స్పష్టీకరణ

'శౌర్య' కమాండోలు తమ సామర్థ్యాలను ప్రదర్శించారని ఐటీబీపీ చీఫ్ వెల్లడి

డ్రోన్లు, యాంటీ డ్రోన్ వ్యవస్థలపై భారత్ దృష్టి పెట్టాలని కపూర్ సూచన



చైనా సైన్యం నిర్దేశిత గస్తీ విధానాలకు భిన్నంగా వ్యవహరించినప్పుడల్లా భారత్-చైనా సరిహద్దుల్లో పరిస్థితులు అప్పుడప్పుడు ఉద్రిక్తంగా మారుతున్నాయని కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడించింది. అరుణాచల్‌ప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో చైనా సైనికులతో ముఖాముఖి పరిస్థితులు కొనసాగుతున్నాయని ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) డైరెక్టర్ జనరల్ శత్రుజీత్ కపూర్ ప్రకటించిన మరుసటి రోజే కేంద్రం ఈ వ్యాఖ్యలు చేసింది.

రక్షణ శాఖను సంప్రదించండి

ఐటీబీపీ చీఫ్ వ్యాఖ్యలపై శుక్రవారం మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ నేరుగా స్పందించలేదు. ఈ అంశంపై రక్షణ శాఖను సంప్రదించాలని సూచించారు. అయితే, చైనా బలగాలు నిర్దేశిత గస్తీ విధానాలను ఉల్లంఘించినప్పుడు సరిహద్దుల్లో పరిస్థితులు మారుతున్నాయని గతంలోనూ చెప్పినట్లు గుర్తుచేశారు.

చర్చలతో సమస్యల పరిష్కారం

వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి అపోహలు, తప్పుడు అంచనాలు తలెత్తకుండా భారత్, చైనా దౌత్య, సైనిక మార్గాల్లో చర్చలు కొనసాగిస్తున్నాయని జైస్వాల్ తెలిపారు. సరిహద్దు నిర్వహణను మెరుగుపరిచేందుకు కొన్ని ప్రాంతాల్లో ఎల్ఏసీపై పరస్పర అవగాహన పెంచుకునే అంశంపైనా చర్చించేందుకు రెండు దేశాలు అంగీకరించాయని చెప్పారు. సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతత కొనసాగడం ద్వైపాక్షిక సంబంధాల అభివృద్ధికి కీలకమని స్పష్టం చేశారు.

అరుణాచల్‌లో ముఖాముఖి పరిస్థితులు

రాజస్థాన్‌లోని ఐటీబీపీ స్థావరంలో గురువారం సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడిన కపూర్.. అరుణాచల్‌ప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో చైనా సైనికులతో ముఖాముఖి పరిస్థితులు ఏర్పడ్డాయని, అవి ఇంకా కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా ఐటీబీపీ కొత్తగా ఏర్పాటు చేసిన 'శౌర్య' కమాండోలు తమ సామర్థ్యాలను ప్రదర్శించారని వెల్లడించారు. చైనా సరిహద్దును తమ దళానికి అత్యంత క్లిష్టమైన ప్రాంతంగా అభివర్ణించారు.

డ్రోన్లపై ప్రత్యేక దృష్టి

చైనా సైన్యం ఆధునికీకరణను కపూర్ ప్రస్తావించారు. సంప్రదాయ పద్ధతుల్లో చైనాతో పోటీపడటం కష్టమని, డ్రోన్లు, వాటిని ఎదుర్కొనే వ్యవస్థలపై భారత్ భారీగా దృష్టి పెట్టాలని సూచించారు. డ్రోన్ల రాకతో సంప్రదాయ సైన్యాల పాత్ర మారిందని పేర్కొన్నారు. అయితే, సరిహద్దుల్లో సాధారణ మోహరింపు, సన్నద్ధతకు సంబంధించిన సందర్భంలోనే ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. నిర్దిష్ట ఘటనను ఆయన ప్రస్తావించలేదని పేర్కొన్నాయి.చైనాతో భారత్‌కు 3,488 కిలోమీటర్ల వాస్తవాధీన రేఖ ఉంది. 2020 జూన్‌లో గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణలో 20 మంది భారత సైనికులు మరణించిన తర్వాత సరిహద్దు పరిస్థితులపై ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. అయితే, ప్రస్తుతం పరిస్థితి స్థిరంగా ఉందని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ ఎన్ఎస్ రాజా సుబ్రమణి సెప్టెంబరులో పేర్కొన్నారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ సైతం చైనాతో సంబంధాలు సాధారణ స్థితికి రావాలంటే సరిహద్దుల్లో శాంతి అవసరమని ఇటీవల స్పష్టం చేశారు.

ఉత్తరాంధ్ర వైపు దూసుకొస్తున్న 'ఆర్నాబ్' తుపాను.. 27, 28 తేదీల్లో కుంభవృష్టి

బంగాళాఖాతంలో బలపడుతున్న అల్పపీడనం

27, 28 తేదీల్లో తీరం దాటే అవకాశం

ఉత్తర కోస్తా జిల్లాలకు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు!

మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని సూచన



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి తుపానుగా మారేందుకు సిద్ధమవుతోంది. ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో ఏర్పడుతున్న ఈ తొలి తుపానుకు 'ఆర్నాబ్' అని పేరు పెట్టనున్నారు. ఇది ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది.శుక్రవారం తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఇది శనివారం నాటికి వాయుగుండంగా, ఆదివారానికి తీవ్ర వాయుగుండంగా మారి, సోమవారం (అక్టోబర్ 26) ఉదయానికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా బలపడనుంది. ఆ తర్వాత పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ అక్టోబర్ 27, 28 తేదీల్లో ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా తీరాల వైపునకు చేరుతుందని ఐఎండీ అంచనా వేస్తోంది.తుపాను ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్ర జిల్లాల్లో గంటకు 70 నుంచి 90 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. కొన్ని వాతావరణ నమూనాలు ఇది మరింత బలపడి తీవ్ర లేదా అతి తీవ్ర తుపానుగా మారవచ్చని సూచిస్తున్నాయి. ఈ నెల 27, 28 తేదీల్లో శ్రీకాకుళం నుంచి పశ్చిమ గోదావరి వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు, అక్కడక్కడా కుంభవృష్టి కురిసే అవకాశం ఉంది. ఒడిశా తీరంలోనూ ఇదే తరహాలో వర్షాలు పడతాయని హెచ్చరించారు.ఈ హెచ్చరికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, ఒడిశా ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. సంబంధిత జిల్లాల యంత్రాంగాలను సిద్ధం చేశాయి. సముద్రం అలజడిగా ఉన్నందున, మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని ఐఎండీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఖరీఫ్ పంట కోత దశలో ఉన్నందున, రైతులు వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. వాతావరణ శాఖ అధికారులు తుపాను కదలికలను నిరంతరం గమనిస్తూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని విడుదల చేస్తున్నారు. ప్రజలు అధికారిక ప్రకటనలను మాత్రమే అనుసరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏపీ మున్సిపల్ ఎన్నికల బరిలో ఎంఐఎం.. 21 స్థానాల్లో పోటీ

ఏపీ మున్సిపల్ ఎన్నికల బరిలో ఆల్ ఇండియా మజ్లిస్-ఇ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) పార్టీ నిలిచింది. రాష్ట్రంలోని రెండు కార్పొరేషన్లు, ఐదు మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 21 మంది అభ్యర్థులను పోటీకి దింపింది.వివరాల్లోకి వెళితే.. కడప కార్పొరేషన్ మేయర్ పదవికి, హిందూపురం మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ పదవికి ఎంఐఎం అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వీటితో పాటు విజయవాడ కార్పొరేషన్‌లోని మూడు డివిజన్లలో, హిందూపురంలో ఐదు వార్డుల్లో, ఆదోనిలో ఏడు, రాయదుర్గ్‌లో మూడు, నంద్యాల, పెనుగొండ మున్సిపాలిటీల్లో ఒక్కో వార్డు చొప్పున అభ్యర్థులను బరిలో నిలిపింది.ఇటీవలే ఏపీకి చెందిన ఎంఐఎం నేతలు హైదరాబాద్‌లో పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విస్తృతంగా పోటీ చేయడం కంటే, పార్టీకి గెలుపు అవకాశాలు బలంగా ఉన్న వార్డులు, డివిజన్లపైనే దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. పార్టీ విస్తరణ ప్రయత్నాల్లో భాగంగా హైదరాబాద్‌కు చెందిన ఎంఐఎం ఎమ్మెల్యేలు జాఫర్ హుస్సేన్ మిరాజ్, మహమ్మద్ ముబీన్, మాజిద్ హుస్సేన్, ఎమ్మెల్సీ రియాజ్ ఉల్ హసన్ ఎఫెండీ ఏపీలో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ ఉనికిని విస్తరించుకోవడంలో భాగంగా పార్టీ ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది.

లైవ్ రిపోర్టింగ్‌లో ప్రమాదం.. సముద్రం ప్రమాదకరం అని చెబుతుండగానే జర్నలిస్ట్‌ను ముంచెత్తిన భారీ కెరటం

స్పెయిన్‌లో ఒక టెలివిజన్ జర్నలిస్ట్ లైవ్ రిపోర్టింగ్ ఇస్తుండగా ఊహించని ప్రమాదం జరిగింది. సముద్ర తీరంలో వాతావరణం ప్రమాదకరంగా ఉందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్న సమయంలోనే ఒక భారీ కెరటం అతడిని బలంగా తాకి కింద పడేసింది. ఈ ఘటన మొత్తం లైవ్‌లో ప్రసారం కాగా, ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.వివరాల్లోకి వెళితే.. స్పెయిన్‌లోని బాస్క్ తీరంలో ఉన్న ఒండారోవా పట్టణంలో సముద్రం అల్లకల్లోలంగా ఉంది. ఈ పరిస్థితులపై 'జుదీ2' ఛానెల్ కోసం పనిచేసే జర్నలిస్ట్ సెర్జియో ఒవెజెరో 'యూస్కాడి క్వెదేట్' అనే కార్యక్రమంలో భాగంగా లైవ్ రిపోర్టింగ్ ఇస్తున్నారు. సముద్రపు గోడ వద్ద నిలబడి, అలల ఉద్ధృతి గురించి వివరిస్తుండగా.. అకస్మాత్తుగా ఒక పెద్ద కెరటం గోడను దాటి రిపోర్టర్‌పై విరుచుకుపడింది.ఆ కెరటం ధాటికి సెర్జియోతో పాటు కెమెరావుమన్ రాక్వెల్ కూడా నియంత్రణ కోల్పోయి కిందపడిపోయారు. నీరు వారిని చుట్టుముట్టడంతో లైవ్ ప్రసారం ఒక్కసారిగా నిలిచిపోయింది. స్టూడియోలో ఉన్న యాంకర్ ఓడెయి ఎస్నాలా, కనెక్షన్ కట్ అవ్వడంతో ఆందోళనకు గురయ్యారు. అయితే, కాసేపటి తర్వాత టీవీ సిబ్బంది స్పందిస్తూ.. సెర్జియో, రాక్వెల్ ఇద్దరూ సురక్షితంగా ఉన్నారని, వారికి ఎటువంటి తీవ్రమైన గాయాలు కాలేదని ప్రకటించారు. ప్రమాదం తర్వాత జర్నలిస్ట్ సెర్జియో కూడా సోషల్ మీడియా ద్వారా తాను క్షేమంగా ఉన్నట్లు తెలుపడంతో ప్రేక్షకులు ఊపిరి పీల్చుకున్నారు.తాను దేని గురించి అయితే హెచ్చరిస్తున్నాడో, అదే ప్రమాదానికి గురైన జర్నలిస్ట్ ఉదంతంపై నెటిజన్లు పలు రకాలుగా స్పందిస్తున్నారు. కొందరు ఆందోళన వ్యక్తం చేయగా, మరికొందరు వారు క్షేమంగా బయటపడటంపై సంతోషం వ్యక్తం చేశారు.

ఆస్పరి మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో ఉద్రిక్తత..

రిటర్నింగ్ ఆఫీసర్‌తో టీడీపీ నేతల వాగ్వాదం



ఆస్పరి (తెలుగు కలం) అక్టోబర్ 24 : ప్రతినిధి : కర్నూలు జిల్లా ఆస్పరి మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. నామినేషన్ల పర్వం సందర్భంగా ఆస్పరిలోని ఎన్నికల కేంద్రం వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గ్రామాల వారీ వివరాలను తమకు అందించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. అయితే అధికారులు ఆ వివరాలు ఇవ్వడానికి నిరాకరించడంతో, రిటర్నింగ్ ఆఫీసర్‌తో టీడీపీ నేతలు తీవ్ర వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలు సక్రమంగా ఉన్నాయా లేదా అనే అంశంపై కూడా ఆర్వోను వారు నిలదీశారు. దీంతో ఎన్నికల కేంద్రంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తమ విధులకు ఈ పరిణామాలు ఆటంకం కలిగిస్తున్నాయని ఎన్నికల సిబ్బంది తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న ఆర్డీఓ వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం రంగప్రవేశం చేసిన పోలీసులు, టీడీపీ నాయకులను ఎంపీడీఓ కార్యాలయం వెలుపలకు పంపివేయడంతో ఉద్రిక్తత సద్దుమణిగి పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చింది.

మార్కాపురం జిల్లాలో ఉద్రిక్తత.. సీఎస్‌పురంలో 11 వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ నామినేషన్లు తిరస్కరణ



సీఎస్‌పురం (తెలుగు కలం) అక్టోబర్ 24 : ప్రతినిధి : మార్కాపురం జిల్లా సీఎస్‌పురం మండలంలో ఎంపీటీసీ నామినేషన్ల పరిశీలన ప్రక్రియ తీవ్ర వివాదానికి దారితీసింది. వైఎస్సార్‌సీపీకి చెందిన 11 ఎంపీటీసీ నామినేషన్లను అధికారులు తిరస్కరించడంపై ఆ పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని సరైన ధ్రువీకరణ పత్రాలు సక్రమంగా సమర్పించినప్పటికీ, కావాలనే తమ నామినేషన్లను తిరస్కరించారని వారు ఆరోపించారు. నామినేషన్ల పరిశీలనలో రిటర్నింగ్ అధికారి పూర్తిగా ఏకపక్షంగా వ్యవహరించారని వైఎస్సార్‌సీపీ నేతలు విమర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, తెలుగు దేశం పార్టీ నేతల నామినేషన్ పత్రాలను పూర్తిస్థాయిలో పరిశీలించకుండానే అధికారులు ఆమోదించారని వారు మండిపడ్డారు. నామినేషన్ల తిరస్కరణపై నిబంధనల గురించి ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ ఎంపీపీ అభ్యర్థి వరుణ్ కుమార్‌ను టీడీపీ నేతలు బెదిరింపులకు గురిచేశారని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. పోలీసుల సమక్షంలోనే నామినేషన్ పత్రాలను చించివేసిన

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

ఆదివారం 25 - 10 - 2026

కొబ్బరి బోండం చెరకు రసం ఏది బెస్ట్ డ్రింక్



వేసవి ఎండల్లో ఎటు చూసినా కొబ్బరి నీరు, చెరకు రసం బండ్లు కనిపిస్తాయి. ఈ రెండు పానీయాలు విభిన్న ఆరోగ్య లాభాలను అందిస్తాయి. కొందరు దాహం తీర్చుకోవడానికి నీటితో పాటు పండ్ల రసాలు, శీతల పానీయాలు తాగుతారు. అయప్పటికీ, వేసవిలో ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇచ్చేవారు కొబ్బరి నీరు, చెరకు రసం వంటి సహజ పానీయాలను ఎంచుకుంటారు. కూల్ డ్రింక్స్‌తో పోల్చితే ఈ రెండు శరీరానికి ఉత్తమం. అయినప్పటికీ, ఈ రెండిటిలో ఏది ఆరోగ్యానికి మేలు చేస్తుందో తెలుసుకోవాలి. ఈ పానీయాలు దాహాన్ని తీర్చడమే కాక, శరీరానికి అనేక పోషక ప్రయోజనాలను అందిస్తాయి. వేసవి ఎండలు మండుతున్నప్పుడు శరీరాన్ని చల్లగా, హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడం అవసరం. కొబ్బరి నీరు, చెరకు రసం వంటి సహజ పానీయాలు దాహం తీర్చడమే కాక, ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. ఈ రెండింటిలో ఏది వేసవిలో ఉత్తమ ఎంపిక? పోషక విలువలు, ఆరోగ్య లాభాల ఆధారంగా విశ్లేషిద్దాం.

కొబ్బరి నీరు..

కొబ్బరి నీరు (100 మి.లీ.) సుమారు 19 కేలరీలు కలిగి తక్కువ శక్తిని అందిస్తుంది. పొటాషియం (250 మి.గ్రా.), సోడియం (45 మి.గ్రా.), మెగ్నీషియం (25 మి.గ్రా.) వంటి ఎలక్ట్రోలైట్‌లు సమృద్ధిగా ఉంటాయి. చక్కెర 3-4 గ్రాములు మాత్రమే కలిగి బరువు నిర్వహణ, మధుమేహం ఉన్నవారికి అనుకూలం. విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్స్ కొద్దిగా ఉండి జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. మూత్రపిండాల ఆరోగ్యం, రక్తపోటు నియంత్రణకు తోడ్పడుతుంది. వేసవిలో చెమటతో కోల్పోయిన ద్రవాలను త్వరగా పునరుద్ధరిస్తుంది. చర్మాన్ని తేమగా, ప్రకాశవంతంగా ఉంచుతుంది. కార్బోహైడ్రేట్స్ (3.7 గ్రా.) తక్కువగా ఉండటం వల్ల త్వరిత శక్తి అందించదు.

చెరకు రసం..

చెరకు రసం (100 మి.లీ.) సుమారు 70-80 కేలరీలు అందిస్తుంది. సహజ చక్కెరలు (13-15 గ్రాములు) ఎక్కువగా ఉండి తక్షణ శక్తిని అందిస్తాయి. ఇనుము (0.4 మి.గ్రా.), కాల్షియం (11 మి.గ్రా.), పొటాషియం (150 మి.గ్రా.) కలిగి రక్త ఆరోగ్యం, రోగనిరోధక శక్తికి సహాయపడుతుంది. యాంటీఆక్సిడెంట్స్, విటమిన్ బి కాంప్లెక్స్ కొద్దిగా ఉంటాయి. వేసవిలో అలసట నివారించడానికి రిఫ్రెష్‌మెంట్ డ్రింక్‌గా ప్రాచుర్యం. అధిక చక్కెర కంటెంట్ రక్తంలో గ్లూకోస్ స్థాయిలను పెంచుతుంది. మధుమేహం, కేలరీలు పరిమితం చేసేవారికి అనుచితం. అతిగా తీసుకుంటే బరువు పెరుగుటకు కారణమవుతుంది. నీటి శాతం (90%) ఎక్కువగా ఉండి హైడ్రేషన్‌కు తోడ్పడుతుంది.

పోషకాల్లో ఏది బెస్ట్..?

కొబ్బరి నీరు అధిక ఎలక్ట్రోలైట్‌లు (పొటాషియం 600-700 మి.గ్రా., సోడియం 45 మి.గ్రా.) కలిగి శారీరక శ్రమ, వేడి వాతావరణంలో కోల్పోయిన ద్రవాలను త్వరగా పునరుద్ధరిస్తుంది. తక్కువ చక్కెర (11 గ్రా./కప్పు), కేలరీలు (45 కేలరీలు/కప్పు) కలిగి బరువు నియంత్రణకు అనువైనది. చెరకు రసం నీటి శాతం (90%) ఎక్కువగా ఉన్నప్పటికీ, తక్కువ ఎలక్ట్రోలైట్‌లు (పొటాషియం 200-300 మి.గ్రా., సోడియం 10-20 మి.గ్రా.) కలిగి హైడ్రేషన్‌లో కొంత నెమ్మదిగా పనిచేస్తుంది. అధిక చక్కెర (30-40 గ్రా./కప్పు), కేలరీలు (150-200 కేలరీలు/కప్పు) కలిగి త్వరిత శక్తిని అందిస్తుంది. మధుమేహం ఉన్నవారికి రక్త గ్లూకోస్ స్థాయిలు పెరిగే ప్రమాదం ఉంది.కొబ్బరి నీరు రోజువారీ హైడ్రేషన్, తక్కువ చక్కెర అవసరమైనవారికి, మధుమేహం ఉన్నవారికి, బరువు తగ్గాలనుకునేవారికి ఉత్తమం. శారీరక శ్రమ తర్వాత ఎలక్ట్రోలైట్‌లను పునరుద్ధరించడానికి అనువైనది. చెరకు రసం చురుకైన వ్యక్తులకు, అలసట సమయంలో త్వరిత శక్తి కోరుకునేవారికి అనుకూలం. అధిక చక్కెర కారణంగా వారానికి 3-4 సార్లు పరిమితంగా తీసుకోవడం మంచిది. రోడ్డు పక్కన తయారయ్యే చెరకు రసం విషయంలో పరిశుభ్రతపై శ్రద్ధ అవసరం.

ఖాళీ కడుపుతో అరటిపండు ఇలా తింటే ఎవ్వరికీ తెలియని లాభాలు బోలెడు



